

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 16-03-2025 | సంపుటి - 21 సంచిక - 324 రూ : 4 పేజీలు: 8


## ఏబీసీడీలు తెలియకుండా కేంద్రంతో యుద్ధమా!

- తమిళనాడు సీఎం ప్రజల్ని రెచ్చగొడుతున్నారు: కిషన్‌రెడ్డి
- సికింద్రాబాద్‌లో కవచ్ పరిశోధనా కేంద్రం నెలకొల్పనున్నట్లు వెల్లడి



బేగంపేట : 'ఏబీసీడీలు కూడా తెలియకుండా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్రంపై యుద్ధం చేస్తానంటే ఎలా' అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం దక్షిణ భారత ప్రజలను రెచ్చగొడితే ప్రజలు ఊరుకోరని, మరింత చైతన్యం అవుతారని ఆయన పేర్కొన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు శనివారం ఇక్కడికి వచ్చిన కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. తమిళనాడులో జరగనున్న ఎన్నికల్లో భాగంగానే స్టాలిన్ ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో అన్ని

తరువాయి 2లో



## అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర

- సమాజం, ఆరోగ్యం కోసం నెలలో ఒకరోజు కేటాయించండి
- తణుకు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

తణుకు : 'స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలనూ అలాగే ఉంచుకోవాలి. అప్పుడే రాష్ట్రం శుభ్రంగా ఉంటుంది. స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుంది. దీనికోసం నెలలో మూడో శనివారం అందరం కలిసి పనిచేద్దాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి

తరువాయి 2లో

## భారాస హయాంలోనే కృష్ణా జలాలపై తీరని అన్యాయం

- ఆనాడు చంద్రబాబుకు మోకరిల్లి 299 టీఎంసీలు చాలని కేసీఆర్, హరీశ్ సంతకం పెట్టారు
- కేసీఆర్ వస్తే శాసనసభలో చర్చకు సిద్ధం
- 'మార్చురీ' వ్యాఖ్యలు భారాసను ఉద్దేశించినవి
- రూ.57 లక్షల వేతనం తీసుకొని మాజీ సీఎం రెండు సార్లే సభకు వచ్చారు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం 300 సార్లయినా ఢిల్లీకి వెళ్తా
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: భారాస హయాంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని.. కేసీఆర్, హరీశ్‌రావులు చంద్రబాబుకు మోకరిల్లి 811 టీఎంసీలలో 299 టీఎంసీలే చాలని సంతకం పెట్టి రాష్ట్రానికి శాశ్వత మరణ శాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని మహబూబ్‌నగర్ ప్రజలు రాజకీయ భిక్షపెడితే.. ఆయన వారి గుండెల మీద తన్నారని, ఎంపీగా గెలిపించిన ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా

తరువాయి 2లో



## అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం...



- పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు దంపతులు
- హాజరైన గవర్నర్, మంత్రులు, ప్రముఖులు
- ఆధ్యాత్మిక శోభతో వెలుగులీనిన అమరావతి

అమరావతి; గుంటూరు సాంస్కృతికం, తుళ్లూరు, న్యూస్‌టుడే: శ్రీనివాసుని కల్యాణంతో అమరావతి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం శనివారం

తరువాయి 2లో




## మోదీ వల్లే అస్సాంలో శాంతి

: అమిత్‌షా

దెర్‌గావ్: కాంగ్రెస్ అధికారంలో ఉండగా అస్సాంలో శాంతి స్థాపనకు వీలు కల్పించలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. కాంగ్రెస్ పాలన సమయంలో తాను కూడా నిర్బంధాలను ఎదుర్కొన్నానని

తరువాయి 2లో

## నింగిలోకి స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక

### కొద్ది రోజుల్లోనే భూమ్మీదకు సునీతా విలియమ్స్!

కేప్ కెనావెరాల్: వారంరోజుల యాత్ర కోసం రోదసిలోకి వెళ్లి.. 9నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోనే చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు త్వరలోనే భూమ్మీదకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. వీరి స్థానంలో అక్కడ విధులు నిర్వర్తించేందుకు నలుగురు వ్యోమగాములతో కూడిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక శనివారం తెల్లవారుజామున 4.33 గంటలకు

తరువాయి 2లో










## గత సీఎంలాగే అందరూ ఉంటారనుకుంటే ఎలా?

- మహిళా వర్సిటీకి అప్పటి ముఖ్యమంత్రి ఏనాడైనా వెళ్లారా?
- భారాస హయాంలో కంటే ఎక్కువ రుణమాఫీ చేశాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్: ''కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి తొలుత నైపుణ్య వర్సిటీతోనే విద్యావ్యవస్థ ప్రక్షాళన మొదలుపెట్టారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చారు. ఒకేసారి రూ.11 వేల కోట్లతో 58 సమీకృత గురుకులాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దాదాపు 11 వేల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశారు. 22 వేల మందికి పదోన్నతులిచ్చారు. 36 వేల మందికి బదిలీ చేశారు. ఇలా 15

తరువాయి 2లో

## విధానాన్ని మార్చుకున్నాననడం అవగాహనా రాహిత్యం

- హిందీని భాషగా వ్యతిరేకించలేదు
- తప్పనిసరి చేయడాన్నే వ్యతిరేకించా
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అమరావతి: హిందీని ఒక భాషగా తానెప్పుడూ వ్యతిరేకించలేదని, దానిని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే వ్యతిరేకించానని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. రాజకీయ ఎజెండా కోసం ఈ విధానాన్ని తప్పు పట్టడం తగదన్నారు. బహుభాషా విధానంపై పవన్‌కల్యాణ్ తన వైఖరిని మార్చుకున్నారని కొందరు అనడం అవగాహనా రాహిత్యమని శనివారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'ఒక భాషను బలవంతంగా రుద్దడం, గుడ్డిగా వ్యతిరేకించడం.. ఈ రెండూ మన జాతీయ, సాంస్కృతిక సమైక్యత లక్ష్యాన్ని సాధించడానికి సహాయపడవు. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)లో హిందీని అమలు చేయనప్పుడు.. దాని గురించి తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే. ఎన్ఈపీ ప్రకారం.. విద్యార్థులు విదేశీ భాషతో పాటు

తరువాయి 2లో

# భారాస హయాంలోనే కృష్ణా జలాలపై తీరని అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నప్పుడే వైఎస్ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను నిర్మించారని చెప్పారు. 'మార్చురీ' వ్యాఖ్యలు భారాస పార్టీని ఉద్దేశించినవేనని.. కేసీఆర్ వందేళ్లపాటు ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలని, తాము అధికారంలోనే ఉంటామని తెలిపారు. శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు కేసీఆర్ వద్ద ఉన్న కుర్చీని గుంజుకొని తనను కూర్చోబెట్టారని.. ఇక ఆయన వద్ద నుంచి తీసుకోవాల్సింది ఏమీ లేదన్నారు. కేసీఆర్‌కు ఉన్న ప్రధానప్రతిపక్ష నేత పదవి కేటీఆర్, హరీశ్‌రావులకు అవసరమని చెప్పారు. ప్రాణహాని ఉందనే.. కేసీఆర్ కుటుంబానికి దూరంగా, పోలీసుల భద్రత నడుమ ఉంటున్నారని ఆరోపించారు.

దిల్లీ పర్యటనల పేరిట తాను ఎలాంటి దుబారా చేయడం లేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను కలుస్తున్నానన్నారు. దిల్లీకి తాను 32 సార్లు కాదు.. అవసరమైతే 300 సార్లు వెళ్తానన్నారు. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని వెల్లడించారు.

*** రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలపై గౌరవం**

"గత ప్రభుత్వం గవర్నర్ ప్రసంగం లేకుండానే 2022 బడ్జెట్ సమావేశాలను నిర్వహించింది. బలహీనవర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను అవమానించేలా వ్యవహరించింది. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవస్థలను, సంస్థలను గౌరవించుకుంటూ ముందుకు వెళుతున్నాం. సీనియర్లమని, పదేళ్లు మంత్రులుగా చేశామని చెప్పుకొనేవాళ్లు గవర్నర్ ప్రసంగాన్ని తప్పుపడుతున్నారు. మేం అమలు చేసే వాటినే మంత్రివర్గంలో ఆమోదించి గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచాం. పదేళ్లు పాలించినవారు మంత్రివర్గం ఆమోదం లేకుండానే ఆయా అంశాలను గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారా? గవర్నర్, స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తున్నారు. సమర్థించుకుంటూ ధర్నాలు చేస్తున్నారు.. ఇదెక్కడి న్యాయం?

*** రైతుల ఆత్మగౌరవం పెంపొందించాం**

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు అప్పులే కారణం. భారీగా అప్పులు చేసిన నీరవ్ మోదీ, లలిత్‌మోదీ, విజయ్‌మాల్యా దేశం విడిచి పారిపోయారు. మరోవైపు అవమానం భరించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అన్నదాతల కోసం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశాం. ఆనాటి ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొడితే.. మేం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాల్లో వేశాం. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు తెచ్చాం. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ మాట్లాడారు. మేం వచ్చాక ధాన్యం కొనుగోలు చేసి సన్నాలకు బోనస్ సైతం అందించాం. కాళేశ్వరం లేకుండానే రైతులు 1 కోటి 56 లక్షల టన్నుల ధాన్యం పండించారు.

*** వారి పాలనలోనే మరణశాసనం**

కృష్ణా జలాల విషయంలో భారాస హయాంలో తెలంగాణకు మరణశాసనం రాశారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కేటాయింపు ఉంది. చంద్రబాబు ముందు మోకరిల్లి ఉమాభారతి సమక్షంలో తెలంగాణకు 299 టీఎంసీల వాటా చాలని.. ఏపీ 512 టీఎంసీలు వాడుకునేందుకు ఒప్పుకొంటూ కేసీఆర్, హరీశ్‌రావు సంతకం చేశారు. వైఎస్ ఆశీర్వాదంతో కేంద్ర మంత్రి అయిన కేసీఆర్ పోతిరెడ్డిపాడు పొక్కను పెద్దది చేస్తుంటే చూస్తూ ఊరుకున్నది నిజం కాదా..? కాంట్రాక్టర్లు ఇచ్చిన కమీషన్ల కోసం కక్కుర్తి పడి జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది వాస్తవం కాదా? ఈ నేపథ్యంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసినా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. కేసీఆర్ పాలనలో ఎస్ఎల్‌బీసీ పనులే చేపట్టలేదు. ప్రస్తుతం జరిగిన ప్రమాదానికి కారణం ఆయన కాదా..? జగన్ ప్రభుత్వం పర్యావరణ అనుమతులు లేకుండా రోజూ 10 టీఎంసీలు తరలించుకుపోయే ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కేసీఆర్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. ఒక సామాన్య రైతు గవినోళ్ల శ్రీనివాస్ గ్రీన్ ట్రైబ్యునల్‌కు వెళ్తే విధి లేని పరిస్థితుల్లో ఆనాటి ప్రభుత్వం ఇంప్లీడ్ అయింది. ఆనాడు రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని తెలంగాణకు కేసీఆర్ అన్యాయం చేశారు. కేసీఆర్ ఏ రోజు వస్తే ఆ రోజు కృష్ణా జలాలపై చర్చ పెడదాం.

ఆడబిడ్డలకు అన్నగా..

తెలంగాణలో మహిళలు నన్ను ఇంటిబిడ్డగా చూసుకున్నారు. ఆడ బిడ్డలకు స్వేచ్ఛ కల్పించాలని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. రూ.500లకే సిలిండర్ ఇస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 1000 ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చాం. 1000 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి వారి ద్వారానే చేయిస్తున్నాం. మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలు ఇవ్వాలని కోటి 30 లక్షల చీరలు నేతన్నలకు ఆర్డర్ ఇచ్చాం.

*** వర్క్‌ఫ్రమ్ హోం ఉందా?**

2023 డిసెంబరు నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు.. 15 నెలల్లో రూ.57,84,124 వేతనం తీసుకొని కేసీఆర్ సభకు కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారు. ప్రజల సొమ్మును జీతభత్యాలుగా పొందుతూ ఆయన సభకు రావట్లేదు. రాజకీయాల్లో వర్క్ ఫ్రమ్ హోం, వర్క్ ఫ్రమ్ ఫాంహౌస్ వంటివి ఉన్నాయా? కమీషన్లిచ్చే కాంట్రాక్టర్లు దావత్‌లు ఇచ్చే దోస్తులు వీళ్లేనా.. భారాసకు కావాల్సింది.

*** వారిది పైశాచికానందం**

నేను అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి వస్తుందనే సభకు రాకుండా కేసీఆర్ ముఖం చాటేస్తున్నారు. తప్పులు, అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచేస్తే ఆ శిక్షను ప్రజలు అనుభవించాలా? తెలంగాణలో ఎక్కడ ప్రమాదం జరిగినా వాళ్ల కళ్లలో మెరుపు కనిపిస్తోంది. పైశాచికత్వంలో ఉగాండా అధ్యక్షుడు ఈదీఅమీన్‌తో పోటీ పడుతున్నారు. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో వారికి గుండు సున్నా ఖాయం. ప్రపంచ దేశాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే దానికీ అడ్డంపడుతున్నారు. గత పదేళ్లలో హైదరాబాద్ నగరాన్ని నాశనం చేశారు. ఇప్పుడు చెరువులు, కుంటలను పునరుద్ధరిస్తుంటే రియల్ ఎస్టేట్ పడిపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారు.

*** మోదీని కలవడంలో రాజకీయం లేదు**

ప్రధాని మోదీ ముఖ్యమంత్రులకు పెద్దన్న లాంటి వ్యక్తి. ఆయన్ను కలవడంలో రాజకీయమేముంది?. కేంద్ర సాయంతోనే రాష్ట్ర ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయి. మోదీని కలిసినంత మాత్రాన రాజకీయ ఒప్పందాలంటూ ఆరోపణలు చేయడం అనవసరం. వరంగల్ ఎయిర్‌పోర్టు మేం తెచ్చిందే. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం టెండర్ల దశకు రావడంతోపాటు రక్షణశాఖకు సంబంధించిన భూ బదలాయింపు జరిగిందీ మా వల్లే. నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ విషయంలో మాతో పాటు భాజపా ఎమ్మెల్యే శంకర్ కూడా దిల్లీకి వచ్చారు. అవసరమైతే మహేశ్వర్‌రెడ్డినీ దిల్లీకి తీసుకెళ్తాం. మహేశ్వర్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు.. ఈరోజు కాకున్నా రేపైనా మాతోపాటు కూర్చుంటారు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మోదీ వల్లే అస్సాంలో శాంతి: అమిత్‌షా

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. విద్యార్థి ఉద్యమం కారణంగా తనని జైల్లో పెట్టారని, కఠినంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడమేకాక, మౌలిక సదుపాయాలు అభివృద్ధి పరిచారని, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించారని ఆయన అన్నారు. అస్సాంలోని గోలాఘాట్ జిల్లాలోని దెర్‌గావ్‌లో శనివారం లచిత్ బార్ఫూకాన్ పోలీస్ అకాడమీ తొలిదశ భవన సముదాయాన్ని ప్రారంభించి రెండో దశ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. "రాష్ట్రంలో శాంతి తిరిగి రావడంతో పదేళ్లలో 10 వేల మందికి పైగా యువకులు ఆయుధాలు త్యజించి జనజీవన స్రవంతిలో కలిశారు. ఒకప్పుడు ఉద్యమాలకు, హింసకు, తిరుగుబాటుకు నెలవైన అస్సాం ఈరోజు అత్యాధునిక సెమీ కండక్టర్ పరిశ్రమకు కేంద్రం. ఇక్కడ ఈ పరిశ్రమ కోసం రూ. 27,000 కోట్లు వెచ్చించబోతున్నాం. ఇది అస్సాం భవితవ్యాన్ని మార్చేయనుంది" అని అమిత్ షా వివరించారు. పెట్టుబడుల సదస్సులోని ప్రాజెక్టులు కార్యరూపు దాలిస్తే దేశం నలుమూలల నుంచి యువకులు అస్సాంకు వస్తారని చెప్పారు.

# గత సీఎంలాగే అందరూ ఉంటారనుకుంటే ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

నెలల్లో ఎన్నో చేశారు" అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై భారాస సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో భట్టి జోక్యం చేసుకొని గత సీఎంలాగానే అందరూ ఉంటారనుకుంటే ఎలాగని ప్రశ్నించారు. "12 మంది వీసీలను నియమించాం. వందేళ్ల చరిత్ర ఉన్న ఓయూకు తొలిసారిగా దళిత ఉపకులపతిని నియమించాం. మీలా విద్యావ్యవస్థను గాలికొదిలేయలేదు. హాస్టళ్ల విద్యార్థులకు 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మెటిక్ ఛార్జీలు పెంచాం. మహిళా వర్సిటీని ఏర్పాటు చేసిన గత సీఎం.. ఏనాడైనా ఆ విశ్వవిద్యాలయానికి వెళ్లారా? మేం అక్కడి పాత భవనాల పునరుద్ధరణకు రూ.15 కోట్లు, భవనాల నిర్మాణానికి రూ.540 కోట్లు మంజూరు చేశాం.

**ప్రచారం చేసుకోవడం లేదు**

మేం నిరంతరం పనిచేసుకుంటూ పోతున్నాం. పథకాలు అమలు చేస్తున్నాం. కాకపోతే ప్రచారం చేసుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 34 నెలల్లోనే రుణమాఫీ చేశారు. మీరు ఐదారేళ్లలో చేసిన రుణమాఫీ కంటే ఎంతో ఎక్కువ చేశాం. గజ్వేల్ నియోజకవర్గంలో 2018లో మీరు రూ.104 కోట్లు రుణమాఫీ చేయగా.. మేం రూ.235.33 కోట్లు చేశాం. సిద్దిపేటలో గతంలో రూ.96.62 కోట్లు చేస్తే.. ఇప్పుడు రూ.175.95 కోట్లు చేశాం. సిరిసిల్లలో అప్పుడు రూ.101.76 కోట్లు కాగా.. ఇప్పుడు రూ.175.84 కోట్లు మాఫీ చేశాం. గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్‌కు గజ్వేల్ నియోజకవర్గంలో రూ.25.41 కోట్లు, సిద్దిపేటలో రూ.20.37 కోట్లు, కామారెడ్డిలో రూ.27.04 కోట్లను ప్రభుత్వం చెల్లించింది" అని భట్టివిక్రమార్క వివరించారు.

*** శాస్త్రీయంగానే కులగణన: మంత్రి ఉత్తమ్**

రాష్ట్రంలో బీసీ కులగణనను, ఎస్సీ వర్గీకరణను



శాస్త్రీయంగా, హేతుబద్ధంగా జరిపామని, ఆ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. "గతంలో భారాస ప్రభుత్వం చేసిన సమగ్ర కుల సర్వేను ఎందుకు సభలో ప్రవేశపెట్టలేదు? పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు అందుబాటులో ఉంచలేదు? అంకెలపై నమ్మకం లేకనా? బీసీలపై వ్యతిరేకతతోనా? గత ప్రభుత్వం చేసిన సర్వేతో పోల్చితే ఈసారి బీసీలు ఆరు శాతం పెరిగారు. ఓసీలు ఆరు శాతం తగ్గారు. సర్వేలో పాల్గొననివారికి మరో అవకాశం ఇచ్చాం. భారాస ముఖ్యనేతలు కులగణన సర్వేలో పాల్గొనలేదు. పులిచింతల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి అన్యాయం జరగలేదు. ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో 811 టీఎంసీలు కేటాయించగా.. అందులో ఏపీకి 512 టీఎంసీలు ఇవ్వాలని, తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని సంతకం చేసింది మీరు కాదా? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేటాయింపులకు ఒప్పుకోబోమని తేల్చిచెప్పాం. భారాస ప్రభుత్వానికి టెలిమెట్రీ పరికరాలు పెట్టించడం చేతకాలేదు. వాటిని మేం పెట్టించాం. గత సీఎం ప్రగతిభవన్‌లో విందులు చేసుకుంటుంటే అప్పటి ఏపీ సీఎం జగన్ రాయలసీమ ఎత్తిపోతల పనులు మొదలుపెట్టారు" అని ఉత్తమ్ విమర్శించారు.

*** వారు కాకతీయ ఉత్సవాలు జరిపారా?: శ్రీధర్‌బాబు**

విద్యాశాఖ జారీ చేసిన ప్రకటనలో కాకతీయ



తోరణం, చార్మినార్‌ను తొలగించిన లోగోను ముద్రించారని భారాస సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించారు. "కాకతీయులపై ప్రేమ కురిపిస్తున్న మీరు 2014 నుంచి 2023 వరకు ఒక్కసారైనా కాకతీయ ఉత్సవాలు జరిపారా? మేం తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడతాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పటివో చెప్పడం లేదు. మీరు నడుపుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలను తీర్చిదిద్దుతాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. మహిళా జర్నలిస్టులపై కేసుల అంశంపై మంత్రి పొన్నం స్పందిస్తూ.. జర్నలిస్టులంటే తమకు గౌరవం ఉందన్నారు. కానీ, ఆ మహిళా జర్నలిస్టులు ప్రచారం చేసిన వీడియోలోని భాష వింటే కేసులు ఎందుకు పెట్టామో అర్థమవుతుందన్నారు.

# నింగిలోకి స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక

(మొదటిపేజీ తరువాయి)

(భారత కాలమానం ప్రకారం..) అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి రోదసిలోకి దూసుకెళ్లింది. క్రూ 10 మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్‌9 రాకెట్ దీన్ని నింగిలోకి మోసుకెళ్లింది. ఇందులో అమెరికాకు చెందిన ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్, జపాన్ వ్యోమగామి టకుయా ఒనిషి, రష్యాకు చెందిన కిరిల్ పెస్కోవ్‌లు ఐఎస్ఎస్‌కు పయనమయ్యారు.

# అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా తణుకులో సీఎం పర్యటించారు. ముందు స్థానిక ఎన్టీఆర్ పార్కులో పారిశుద్ధ్య కార్మికులను కలిసి, కూరగాయల మార్కెటును, ఐక్యనగర్‌లోని సామాజిక స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగించారు. 'స్వచ్ఛాంధ్ర కోసం పనిచేసినవారిని ప్రభుత్వమే వెతుక్కుంటూ వెళ్లి సత్కరించింది. అలా మీరూ ఆలోచించాలి. ఈరోజు నా పక్కన కూర్చున్నది మున్సిపల్ కార్మికులు. మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నది వారే. వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. కొంతమంది మహిళలు స్వచ్ఛాంధ్ర కోసం పనిచేస్తామని ముందుకొచ్చారు. వారిని స్వచ్ఛాంధ్ర సేవకులుగా గుర్తిస్తాం. వారితో రాష్ట్రమంతా అవగాహన కల్పిస్తాం' అని చంద్రబాబు వివరించారు.

**అక్టోబరు 2 తర్వాత ఆకస్మిక తనిఖీలు**

1995 ప్రాంతంలో నేను బయటకు వస్తుంటే ఎప్పుడు ఏ శాఖ మీద ప్రశ్నలు వేస్తాను, ఏ ప్రాంతానికి వెళ్తానోనని భయపడేవారు. అక్టోబరు 2 తర్వాత మళ్లీ అదే పరిస్థితి వస్తుంది. ఇప్పటినుంచే పనిచేయండి. సమస్యలు పరిష్కరించే బాధ్యత మీపైన ఉంది. హెలికాప్టరెక్కిన తర్వాత ఎక్కడికి వెళ్లాలో చెబుతాను. గంట ముందు అధికారులను అప్రమత్తం చేస్తాం. ఎమ్మెల్యేలందరూ పరిగెత్తాల్సి వస్తుంది. దానికంటే ముందునుంచే పనిచేయాలి.

**అదే నా జీవితాశయం**

దేశంలో పచ్చదనంపరిశుభ్రత ప్రాధాన్యాన్ని తొలుత నేనే గుర్తించాను. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నా జీవితాశయం. విశాఖపట్నం, గుంటూరుల్లో వ్యర్థాల నుంచి రెండు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటుచేశాం. నెల్లూరు, రాజమహేంద్రవరాల్లో రూ.700 కోట్లతో 22 మెగావాట్ల ప్లాంట్లను పెడుతున్నాం. 85 లక్షల టన్నుల చెత్తలో ఇప్పటికి 51 లక్షలు తీశారు. మిగిలింది అక్టోబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశించాం. తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధితో ఈ రోజున దేశంలో అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణలో వస్తోంది. అప్పట్లోనే విజన్2020 తయారుచేశాం. ప్రస్తుతం స్వర్ణాంధ్ర2047 తీసుకొచ్చాం. మన తలసరి ఆదాయం రూ.2.60 లక్షలే ఉంది. దక్షిణ భారతదేశంలో మనదే తక్కువ. గత ఐదేళ్లూ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు. కనీసం కాలువల్లో మట్టి కూడా తీయలేదు. స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం మనందరం ఉద్యమం చేయాలి.

# అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఆరు గోపురాలతో ఏర్పాటుచేసిన నమూనా ఆలయం వేదికపై అంగరంగవైభవంగా దేవదేవుడి కల్యాణం జరిగింది. వేలమంది భక్తులు వేడుకను వీక్షించి, తన్మయత్వంతో గోవిందుడిని స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తితిదే ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. అర్చకస్వాముల సభా ప్రార్థన, విష్వక్సేనారాధనతో కల్యాణవేడుక ప్రారంభమైంది. ప్రతి ఘట్టానికి తగినట్టు గాయనీ గాయకులు అన్నమయ్య కీర్తనలు గానం చేశారు. వేదోక్త మంత్రఘోషతో సద్యోఅంకురార్పణం, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ, కల్యాణోత్సవ సంకల్పం, మహాసంకల్పం, మాంగల్యధారణం, ప్రధాన హోమం, పూర్ణాహుతి జరిగాయి. అనంతరం పూల బంతులాట, నూతన వధూవరులు పూలదండలు మార్చుకోవడం సరస సమ్మిళితంగా సాగింది. ఏ వైపు చూసినా భక్తజన పవిత్ర మనస్సంకల్పంతో కల్యాణమూర్తుల దర్శనభాగ్యం దక్కిందన్న ఆనందానుభూతులు కనిపించాయి. ఇసుకేస్తే రాలని భక్త జనవాహినితో కల్యాణ ప్రాంగణం నిండిపోయింది.

**స్వామివారి సేవలో సీఎం దంపతులు**

వేంకటేశ్వర స్వామివారికి ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకకు హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రముఖులకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి తొలుత ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. హారతి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్కడ నుంచి కల్యాణ వేదిక వద్దకు వచ్చి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముహూర్తం మేరకు 6 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమైంది. కల్యాణ వేదికను దేశవిదేశాల్లో లభ్యమయ్యే రకరకాల పత్రాలు, పూలతో అలంకరించారు. 4 టన్నుల స్థానిక పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌ను వినియోగించారు. తితిదేకు చెందిన పెదజీయర్, చినజీయర్ స్వాములు, కమలానంద భారతి, అహోబిలస్వామి, శివస్వామి, తాళ్లపాక అన్నమయ్య వంశీయులు హాజరయ్యారు. వేడుక అనంతరం వారిని సీఎం సత్కరించారు. క్రతువుకు వ్యాఖ్యాతగా సహస్రావధాని మేడసాని మోహన్ వ్యవహరించారు. తిరుమల నుంచి తెచ్చిన 50 వేల చిన్న లడ్డూలను భక్తులకు అందించారు. తితిదే అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో అమరావతి అక్షయ ఫౌండేషన్ వారు పులిహోర, పెరుగన్నం, రవ్వ కేసరి, స్వీట్ ప్యాకెట్లు 40 వేల చొప్పున పంచారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తితిదే బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, సుచిత్ర ఎల్ల, పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి, సదాశివరావు, ఎం.శాంతారాం, తమ్మిశెట్టి జానకీదేవి, ఎస్.నరేష్‌కుమార్, జి.భానుప్రకాశ్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విధానాన్ని మార్చుకున్నాననడం అవగాహనా రాహిత్యం

(మొదటిపేజీ తరువాయి)

ఏదైనా రెండు భారతీయ భాషలను (వారి మాతృభాష సహా) నేర్చుకునే వెసులుబాటు ఉంది. హిందీ చదవడం ఇష్టం లేకపోతే... తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, సంస్కృతం, గుజరాతీ, అస్సామీ, కశ్మీరీ, ఒడియా, బెంగాలీ, పంజాబీ, సింధీ, బోడో, డోగ్రీ, కొంకణి, మైథిలి, మైతీ, నేపాలీ, సంతాలీ, ఉర్దూ... మరేదైనా భారతీయ భాషను ఎంచుకోవచ్చు. విద్యార్థులకు సాధికారత కల్పించడానికి, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి, భారత భాషా వైవిధ్యాన్ని పరిరక్షించడానికి బహు భాషా విధానాన్ని రూపొందించారు. ప్రతి భారతీయునికీ భాషాపరమైన స్వేచ్ఛ, విద్యా ఎంపిక అనే సూత్రానికి జనసేన కట్టుబడి ఉంది' అని పేర్కొన్నారు.

# ఏబీసీడీలు తెలియకుండా కేంద్రంతో యుద్ధమా!

(మొదటిపేజీ తరువాయి)

భాషలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తెలుగు, తమిళ సినిమాలను ఉత్తర భారతీయులు ఎంతో ఆదరిస్తున్న విషయం గుర్తించాలన్నారు.

**సికింద్రాబాద్‌లో కవచ్ పరిశోధనా కేంద్రం**

రైలు ప్రమాదాలు జరగకుండా అడ్డుకునే స్వదేశీ కవచ్ సాంకేతికతకు సంబంధించిన పరిశోధనా కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో నెలకొల్పనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. దేశంలోని అన్నిరైల్వే నెట్‌వర్క్‌లకు ఉపయోగపడేలా ప్రయోగాత్మకంగా కవచ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ యోచిస్తున్నారని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వచ్చే సంవత్సరానికి శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా అందుబాటులోకి రానుందన్నారు. ఇందుకు రూ.717 కోట్లను మొదటి విడతగా కేటాయించామని పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్లకు సంబంధించి తెలంగాణలో 22 ప్రాజెక్టులు రానున్నాయని, రూ.39,300 కోట్ల ఖర్చుతో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం జరగనుందన్నారు. రాష్ట్రంలో 1096 కిలోమీటర్ల రైల్వే లైన్లను విద్యుదీకరించామని పేర్కొన్నారు. మోదీ హయాంలో రైల్వేలైన్లకు అనుసంధానంగా 453 ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించినట్లు వివరించారు.

# 64 మంది మావోస్టుల లొంగుబాటు

* **వివరాలు వెల్లడించిన మల్టీజోన్–1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా వివిధ క్యాడర్‌లకు చెందిన 64 మంది మావోయిస్టులు భద్రాద్రి జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 81, 141 బెటాలియన్ల ఎదుట లొంగిపోయినట్లు మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న ఏసీఎం-1, పార్టీ సభ్యులు 10 మంది, ఆర్‌పీసీ కమిటీ నుంచి 9 మంది, ఆర్‌పీసీ మిలీషియా సభ్యులు 19 మంది, ఆర్‌పీసీ డీఏకెఎంఎస్ సభ్యులు 11




మంది, ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యులు ఆరుగురు, ఆర్‌పీసీ జీఆర్‌డీ సభ్యులు 8 మంది లొంగిపోయినవారిలో ఉన్నారని వివరించారు. వీరితో కలిపి ఈ రెండున్నర నెలల కాలంలో 122 మంది నిషేధిక మావోయిస్టు పార్టీ సభ్యులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పొందుతూ, వారివారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవనం సాగించేందుకు వీరంతా లొంగిపోయారన్నారు. ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని నక్సలిజాన్ని విడిచిపెట్టి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవనం గడపాలని నిర్ణయించుకోవడం హర్షణీయమన్నారు. గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయిందని, కాలం చెల్లిన సిద్ధాంతాలతోపాటు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే భావన ప్రజల్లో వచ్చిందన్నారు. నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశాల్లో మందుపాతరలు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. లొంగిపోదలచిన మావోయిస్టు సభ్యులు తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించాలని, తద్వారా వారి జీవనోపాధి, పునరావాసం కల్పన కోసం ప్రభుత్వం తరపున వారికి అందవలసిన ప్రతిఫలాలను అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని ఐజీపి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, కాప్రా : నాగార్జున నగర్ కాలనీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. వ్యక్తిగత కారణాలవల్ల అధ్యక్షుడు నామాల కృష్ణ పదవికి రాజీనామా చేయడంతో శనివారం ప్రధాన కార్యదర్శి యావపురం రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షునిగా యావపురం రవి, ప్రధాన కార్యదర్శిగా మొగిలి కరుణాకర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సాదిక్, బైరంకొండ గోపాల్ యాదవ్, మచ్చ మహేందర్ గౌడ్, ఉప కోశాధికారిగా యేరుపుల సాయి వివేక్, సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి శ్రీశైలం, బైరగోని వెంకటేష్ గౌడ్, సిద్ధ గొని నాగరాజ్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహమ్మద్ జహంగీర్ పాషా, చింతల కొండల్ రెడ్డి లను ఎన్నుకున్నారు.

## ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మాజీ కౌన్సిలర్ మోరె రూప

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఉత్తమ సేవలకు గాను గుర్తింపుగా తెలంగాణ స్టేట్ తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో



కొత్తగూడెం మున్సిపాలిటీ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ మోరె రూప కు అవార్డు లభించింది. శనివారం రాత్రి హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన తారా ఉగాది పురస్కారం నిర్వహించి కార్యక్రమంలో ఈ అవార్డు అందించారు. ఈ సందర్భంగా రూప మాట్లాడుతూ తన భర్త రమేష్ కుమార్ తనకు రాజకీయ గురువు అని, భర్త సూచనలతో కరోనా మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ వార్డులోని పేద ప్రజలను కరోనా సమయంలో ఆదుకున్నట్లు చెప్పారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నట్లు చెప్పారు. వార్డులోని పేద ప్రజలకు, క్రీడలు, మహిళలకు విద్యా, వైద్యానికి ముఖ్య ప్రాధాన్యత చ్చినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపే విధంగా కేంద్ర ప్రభుత్వం అందించే జల్ యోజన పథకాన్ని సమర్థవంతంగా వార్డులో నిర్వహించామని, ఇందుకుగాను అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

## ప్రభుత్వ పాఠశాల 10 వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : డిఎస్ఆర్ (సత్యం) ఫౌండేషన్ ఉద్దేశం పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడము అని డిఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దోర్నాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇంటి దగ్గర ఎలాంటి వసతి లేకుండా ఉండి చదువు కు దూరంగా ఉండే పేద పిల్లలకు డిఎస్ ఆర్ (సత్యం) ఫౌండేషన్ వారిని చదువుకు దగ్గర చేర్చుతున్నది అని ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస రెడ్డి తెలిపారు .అందులో భాగంగా శనివారం కేతేపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో ప్యాడ్లు, పెన్నుల పంపిణీ చేయడం జరిగింది. నకిరేకల్ మండలంలో నోముల,తాటికల్, గ్రామాలలో కూడా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. పేద విద్యార్థిని విద్యార్థులకు ఎల్లపుడు ఎల్లపుడు ఏ లాగే సహాయలు అందించాలి అని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు ఈ కార్యక్రమంలో హనుక్,దుబ్బ మధు.చెరుకు రోశయ్య, దుర్గం సైదులు, వెంకన్న, కరుణాకర్ ఆనంద్, రాచకొండశివ, జిల్లా సంతోష్,దుబ్బ మధు. చెరుకు రోశయ్య, దుర్గం సైదులు, వెంకన్న, ఆనంద్, రాచకొండశివ, జిల్లా సంతోష్. తదితరుల పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్

* **టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**
* **హనుమకొండలో రెండు జిల్లాల కార్యవర్గ సమావేశం**



హనుమకొండ , (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కోసం పోరాడుతామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఉద్ఘాటించారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీయూడబ్ల్యూజేజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అద్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ల విషయములో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. డెస్క్ జర్నలిస్టులతో సహా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందే విదంగా టీయూడబ్ల్యూజేకృషి చేస్తుందని అన్నారు. నేడు అక్రిడిటేషన్ లు అంగట్లో సరుకుగా మారాయని, గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారముగా అక్రిడిటేషన్ నిబంధనలు పెట్టి చిన్న పత్రికలను ఏబీసీడీలుగా వర్గీకరించారని, బాషా ప్రాతిపదిక నిబంధనతో ఉర్దూ పత్రికలకు అన్యాయం చేస్తే కోర్టుకు వెళ్లి ఆ నిబంధనలను తొలగించామని అన్నారు. అలాగే జర్నలిస్టులకు ఆరోగ్య పథకం కావాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే పోరాడుతున్న దని, ఇటీవలే ఆర్థిక శాఖ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసి విన్నవించడం జరిగిందని, ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా జేహెచ్ఎస్ ప్రారంభించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇప్పటికే ప్రెస్ అకాడమీ ద్వారా మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయలతో పాటు జర్నలిస్టు భార్యకు ఐదేళ్ల పాటు నెలకు రూ. 3వేల పెన్షన్ అందించడం జరుగుతున్నదని, జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తూనే వాటి కుటుంబాలను ఆదుకునేందుకు టీయూడబ్ల్యూజే కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమే నని, ఏ ప్రభుత్వానికి భజన చేయలేదు కనుకనే డెబ్బై ఏండ్లుగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్రంలో మొనగాడు సంఘంగా జర్నలిస్టుల గుండెల్లో నిలిందని అన్నారు. డెస్క్ జర్నలిస్టులతో సహా జర్నలిస్టుల అక్రిడిటేషన్ లపై ఇతరులు చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ మాట్లాడుతూ జిల్లాల్లో నిర్మాణ పరంగా టీయూడబ్ల్యూజే ను పటిష్ఠం చేయాలని సూచించారు. హైదరాబాద్ తరువాత వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలు కీలకమైనవి అని, నిరంతరం జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూ సంఘం ప్రతిష్టను పెంచాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ లు అర్హులైన వారందరికీ అందేలా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు,సీనియర్ నాయకులు దాసరి క్రిష్ణా రెడ్డి, వరంగల్ జిల్లా అద్యక్షులు ఎం. రాంచందర్, హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు తోట సుధాకర్, మట్టా దుర్గా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పి. వేణు మాధవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం. రజనీకాంత్,గుంటి విద్యాసాగర్, రెండు జిల్లాల ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ లు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాజకీయ పార్టీ లు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పన , ఓటరు జాబితా సంబంధిత ఫారాలు 6,7 , 8 లపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బూత్ లెవెల్ ఏజెంట్లు జాబితా పార్టీ జిల్లా ఇంచార్జ్ ధ్రువీకరణ చేసి అందించాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూతులు, ఓటరు జాబితాలో ఏదైనా సమస్యలు ఉంటే సూచించాలని వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, ఓటర్ తొలగింపు తదితర అంశాలపై రాజకీయ పార్టీలకు పూర్తి అవగాహన అవసరమని ఆయన తెలిపారు. ఫామ్ 6 దరఖాస్తు ద్వారా నూతనంగా ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫామ్ 7 ద్వారా తొలగింపు, అభ్యంతరాలు పై దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చిన దరఖాస్తులను బి ఎల్ వో లు విచారణ చేపట్టి, నోటీసులు జారీ చేసిన తర్వాత మాత్రమే తొలగింపు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఫామ్ 8 ద్వారా తప్పుల సవరణ, ఫోటో మార్పు, ఓట్ షిఫ్టింగ్ తదితర సేవలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఫామ్ 6,7 , 8 లలో 19,514 దరఖాస్తులు రాగా అందులో 10944 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయని, 1,310 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని, 7,260 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఓటర్లు నూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడకు తిరిగే అవసరం లేకుండా బిఎల్ఓ యాప్ ద్వారా అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, రాజకీయ పార్టీ నాయకులకు వచ్చే శనివారం బి ఎల్ ఓ యాప్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని కలెక్టర్ అన్నారు.

## వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా 108లో ప్రసవం

* **తల్లీ, బిడ్డ క్షేమం..**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రక్తహీనత, అధిక రక్తపోటు కారణంగా ప్రసవంలో ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశ్యంతో కొత్తగూడెం ఎంసీహెచ్ వైద్యులు గర్భిణీని వరంగల్ ఎంజిఎంకు 108లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే 108లో ప్రసవించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగ్గు తండాకు చెందిన జ్యోతి అనే గర్భిణీ ప్రసవం నిమిత్తం రామవరం ఏంసిహెచ్‌లో చేరారు. కాగా జ్యోతి రక్త హీనత, అధిక రక్త పోటు కారణంగా ప్రసవంలో ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందనే ఉద్దేశ్యంతో ఆమెను వైద్యుల సూచన మేరకు చుంచుపల్లి 108 సిబ్బంది వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా మార్గమధ్యంలో జ్యోతికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ నందు సిబ్బంది సహకారంతో సుఖప్రసవం చేశారు. జ్యోతి ఆడబిడ్డకు జన్మనివ్వగా, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వీరిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది ఈఎంటీ స్నేహ, పైలెట్ హరిశంకర్ తెలియజేశారు. కుటుంబ సభ్యులు, వైద్యులు 108 సిబ్బందిని అభినందించారు.

## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతిక

* **కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతిక అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్ నగర్ లోని ఇఫ్తార్ విందులో ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు పాల్గొని మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం లో ఉపవాసం ఉండి..నియమ నిష్ఠలతో ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసుకుంటారన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అల్లా దయతో అందరూ ఆయురాగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, టిఆర్ఎస్ నాయకులు సిందం శ్రీకాంత్, ఎర్రబల్లి సతీష్ రావు, శ్రీనివాస్, మొహమ్మద్ గౌస్,ఖలీల్, షకీల్ , షరీఫ్ బాయ్, హమీద్ భాయ్, నర్సింగ్ రావు, రాము, వెంకట్రావు, విష్ణు, హుస్సేన్, రషీద్. ఫెరోజ్ ఖాన్. సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్3లో స్టేట్ ఫస్ట్.. గ్రూప్2లో 18వ ర్యాంక్!

**: టాపర్ చెప్పిన విజయ రహస్యమిదే!**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్3 పరీక్ష ఫలితాల్లో.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలానికి చెందిన అర్జున్ రెడ్డి గ్రూప్ 339 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఇటీవల విడుదల చేసిన గ్రూప్2 పరీక్ష ఫలితాల్లోనూ ఆయన రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించి తన సత్తా చాటారు. అర్జున్ రెడ్డి తండ్రి నరేందర్ రెడ్డి మెదక్ లైబ్రేరియన్, తమ్ముడు అరుణ్ రెడ్డి ఆర్ అండ్ బీలో ఏఈ, బాబాయి శ్రీనివాస్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసున్నారు. గ్రూప్1 సాధించాలన్నదే తన లక్ష్యం అంటున్న అర్జున్ రెడ్డి.. తన విజయ రహస్యాన్ని వివరించారు.

# 'హఠాత్తుగా ఆ దేశంపై అంత ప్రేమ ఎందుకో?'.. రాహుల్‌ను ప్రశ్నించిన భాజపా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని భాజపా మరోసారి విమర్శలు గుప్పించింది. కొంతకాలంగా ఆయన తరచూ వియత్నాంకు వెళ్తున్నారని.. ఒక్కసారిగా ఆ దేశం పట్ల అంత అనురాగం ఎందుకు కలిగిందని ప్రశ్నించింది. సొంత నియోజకవర్గంలో కన్నా వియత్నాంలోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతున్నారని భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలో విమర్శించారు. "రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారు? వియత్నాం వెళ్లారని విన్నాను. తన సొంత నియోజకవర్గం (రాయ్‌బరేలీ)లోనూ ఆయన ఇన్ని రోజులు ఉండటం లేదు. తరచూ ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఆసక్తికరంగా ఉంది. నూతన ఏడాది సమయంలోనూ వియత్నాంలో ఉన్నారు. దాదాపు 22 రోజులు అక్కడ



గడిపారు. ఆ దేశం పట్ల హఠాత్తుగా అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో చెప్పాలి" అని రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా ఆయన భారత్‌లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను భాజపా చాలా కాలంగా రాజకీయ అస్త్రాలుగా మలుచుకుంటోంది. గతేడాది డిసెంబరులోనూ ఆయన వియత్నాం పర్యటనపై విరుచుకుపడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై దేశమంతా సంతాపం వ్యక్తం చేస్తున్న వేళ.. కొత్త సంవత్సరం కోసం వియత్నాం వెళ్లారని ఆరోపించింది. కాంగ్రెస్ మాత్రం వీటిని కొట్టిపారేసింది. ఆయన ప్రైవేటు పర్యటనలను భాజపా రాజకీయం చేస్తోందని, ఒక వ్యక్తిగా ఆయనకు విదేశాలకు వెళ్లే హక్కు ఉందని స్పష్టం చేసింది.

## తమిళ సినిమాల డబ్బింగ్‌పై పవన్ వ్యాఖ్యలు.. స్పందించిన డీఎంకే

త్రిభాషా సూత్రం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు డీఎంకే ప్రభుత్వం మధ్య పెనువివాదం కొన సాగుతోన్న సంగతి తెలిసిందే. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ డీఎంకే తీరును ఆక్షేపించారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నప్పుడు.. తమిళ సిని మాల్ని హిందీలో డబ్బింగ్ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్య లకు డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయీద్ హఫీజుల్లా స్పందిస్తూ పవన్ విమర్శలను తోసిపుచ్చారు. భాషా విధానంపై తమిళనాడు వైఖరిని ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. ''వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలు నేర్చుకోవడాన్ని మేం ఎన్నడూ అడ్డుకోలేదు. ఆసక్తి ఉన్నవారు నేర్చుకోవడం కోసం ఇప్పటికే మా రాష్ట్రంలో హిందీ ప్రచార సభలను నిర్వ హిస్తున్నాం. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో మా రాష్ట్ర ప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దుతోంది. దీన్ని మేం వ్యతిరేకిస్తున్నాం'' అని డీఎంకే ప్రతినిధి వెల్లడించారు. ఈ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత టీకేఎస్ ఎళన్‌గోవన్ మాట్లాడుతూ.. ''1938 నుంచే తమిళు లపై హిందీ భాష బలవంతంగా రుద్ద డాన్ని వ్యతిరేకిస్తున్నాం. ద్విభాషా విధానాన్నే అమలుచేస్తామని ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించు కున్నాం. విద్యా నిపుణుల సలహాలు, సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకు న్నాం. అంతేగానీ.. సినీనటులు, రాజ కీయ నాయకుల అభిప్రాయాలతో ఏకీభవించాల్సిన అవసరం



లేదు. 1968లో ఆ బిల్లు పాస్ అయినప్పుడు పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరు. తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఉండొచ్చు'' అని విమర్శించారు. మరోవైపు భాజపా నేతలు పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభలో పవన్ మాట్లాడుతూ.. త్రిభాషా వాదన సరికాదని, భారతదేశానికి బహుభాషలే కావాలని స్పష్టంచేశారు. ''దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లా డుతున్నారు. అలాంటప్పుడు తమిళ సినిమాల్ని హిందీలో డబ్బింగ్ చేయొద్దు. మీకు డబ్బులేమో ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల నుంచి కావాలా? హిందీ మాత్రం వద్దా? ఇదేం న్యాయం? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య తగ్గి పోతుందంటూ ప్రకటనలు చేస్తున్నవారు.. నిజంగా అవి తగ్గుతాయో లేదో చర్చకు పెట్టాలి. అంతే తప్ప రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా?' అంటూ పవన్ నిలదీశారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రజా పాలన

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి
- సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన కొనసాగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నేతలు సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటాన్ని దహనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు



ప్రజలను తప్పుదోవ పట్టించాలని అన్నింటా అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. దళిత బిడ్డ, అసెంబ్లీ స్పీకర్‌ను అవమానించే పద్ధతిలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మాట్లాడిన తీరు సహించరానిదని అన్నారు. అసెంబ్లీని అవమానించే పద్ధతిలో మాట్లాడిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుంటే బిఆర్ఎస్ నాయకులకు తప్పుగా అనిపిస్తుందా ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేక పార్టీ అని అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని దళితుల పట్ల అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంత వివక్ష చూపిందో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. దళితులకు అనేక హామీల ఇచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా బిఆర్ఎస్ ముంచిందని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో దళితులకు, బిసిలకు అన్యాయం చేశారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెద్దపీట వేయడం జరుగుతుందని అన్నారు. బిఆర్ఎస్ నాయకుల్లాగా ఎవరి మెప్పు కోసం తాము నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు చేయలేదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతిపక్ష హోదాలో సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ప్రజలందరూ గమనిస్తున్నారని, బిఆర్ఎస్‌కు మళ్లీ ప్రజలే బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్, ఉచ్చిడి బాల్ రెడ్డి, తలారి నర్సింలు, యూత్ అధ్యక్షులు రంజాన్ నరేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు మిరుదొడ్డి భాను, డైరెక్టర్ సత్తన్న, కొప్పు రమేష్, గన్నే భాను, తుపాకుల శ్రీనివాస్, మామిండ్ల ఆంజనేయులు, దికొండ దశరథం, డాకూరి మహేందర్, నయీం, నవీన్ తదితరులున్నారు.

## తమిళం మధురమైన భాష : కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

చెన్నై: కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యావిధానం (NEP) అమలు విషయంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళం మధురమైన భాషని అన్నారు. శనివారం ఆయన తమిళనాడులోని శ్రీపెరుంబుదూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రూ.1,112 కోట్లతో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ''తమిళం చాలా మధురమైన భాష. మనమంతా తమిళ సంస్కృతిని గౌరవిస్తున్నాం. దేశానికి, ఈ ప్రపంచానికి అందిన ఆస్తుల్లో అదొకటి. ఆ విషయంలో మనమంతా గర్వపడాలి. అలాగే అన్ని భారతీయ భాషలను ఆస్వా దిద్దాం. మన ప్రధాని అదే స్ఫూర్తితో పనిచేస్తున్నారు. ప్రతిభాషకు ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉండేలా చూసుకోవాలి. అదే సమయంలో మన మధ్య స్నేహాలు, సంబంధాలకు దెబ్బతినకుండా ఉండేలా చూసుకోవాలి. మొత్తంగా మనదేశాన్ని ఐక్యంగా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చుకోవడం, ప్రపంచం మన శక్తిని గుర్తించేలా చూసుకోవడం వంటి లక్ష్యాలను కలిగి ఉండాలి'' అని మంత్రి అన్నారు. జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఈపీ2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై



రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.





## మస్క్ కుమారుడిని హెలికాప్టర్ ఎక్కిస్తూ.. ట్రంప్ ఫొటో వైరల్

ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నాలుగేళ్ల కుమారుడు AX12 మరోసారి ఇంటర్నెట్ దృష్టిని ఆకర్షించాడు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ గార్డెన్‌లో ఈ చిన్నారితో కలిసి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నడుస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. వారాంతం నిమిత్తం ట్రంప్ ఫ్లోరిడాలోని తన నివాసానికి బయల్దేరారు. ఆయనతో పాటు మస్క్ కూడా వెళ్లారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్ సౌత్ లాన్‌లో పార్క్ చేసిన మెరైన్ వన్ హెలికాప్టర్ ఎక్కేందుకు ట్రంప్ వెళ్తుండగా.. ఆయన వెనకే మస్క్ కుమారుడు నడుస్తూ వచ్చాడు. హెలికాప్టర్ మెట్లు ఎక్కేందుకు చిన్నారి ఇబ్బంది పడగా ట్రంప్ స్వయంగా అతడిని లోపలికి ఎక్కించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై ఎలాన్ మస్క్ స్పందించారు. 'హ్యాపీ పిక్చర్' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటోలపై నెటిజన్లు తెగ కామెంట్లు చేస్తున్నారు. 'చిన్నారి మస్క్.. ట్రంప్‌ను ఏమని పిలిచి ఉంటారు?' అని అంటున్నారు. దీంతో 'Drand pa Trump' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. కాగా.. గత కొన్ని రోజులుగా మస్క్ తన అధికారిక కార్యక్రమాలకు ఈ చిన్నారిని వెంట తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఆ మధ్య కుమారుడితో కలిసి అధ్యక్షుడి ఓవల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. ఇటీవల ట్రంప్ టెస్లా కారు కొనుగోలు సమయంలోనూ మస్క్ వెంట కుమారుడు కన్పించాడు. దీంతో 'చిన్నారి మస్క్' ట్రెండింగ్‌లోకి వచ్చాడు.

## అంగరంగ వైభవంగా ఇస్కాన్ అత్తాపూర్ లో
# శ్రీ చైతన్య మహాప్రభువు 539వ ఆవిర్భావ వేడుకలు

* హరే కృష్ణ నామ సంకీర్తనతో మార్మోగిన ఇస్కాన్ అత్తాపూర్ ప్రాంగణం
* తరలివచ్చిన 5 వేల మందికి పైగా భక్తులు
* రోజంతా అన్నదాన కార్యక్రమం నిర్వహణ

హైదరాబాద్ 15 మార్చి (ప్రజాస్ఫూర్తి) : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీ కృష్ణ నామాన్ని విశ్వ వ్యాప్తం చేసేందుకు కృషి చేసిన మహానుభావులు, కృష్ణ భగవానుడికి ప్రతిరూపంగా భావించే శ్రీ చైతన్య మహాప్రభువు 539వ ఆవిర్భావ తిథి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్ అత్తాపూర్ లోని ఇస్కాన్ ఆలయం ఈ సందర్భంగా హరే కృష్ణ నామ జపంతో మార్మోగిపోయింది. దాదాపు 5 వేల మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా





ఉదయం 7.30 గంటలకు దర్శన హారతి నిర్వహించారు. 8 గంటల నుంచి శ్రీ చైతన్య మహాప్రభు లీలలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. సాయంత్రం 5.30 గంటలకు మహా అభిషేకం, ఆరున్నరకు చప్పన్ భోగ్ నైవేద్యం, 7 గంటలకు గౌర హారతి ఇచ్చారు. 7.30 గంటల నుంచి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీ చైతన్య మహాప్రభువు, పవిత్ర భగవన్నామమైన హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే అనే మంత్రాన్ని సామూహిక నామ సంకీర్తన ద్వారా వ్యాప్తి చేశారు .ప్రస్తుత కలియుగంలో ఈ మంత్రం తారక మంత్రంగా శాస్త్రం చెబుతుంది. అందుకే ఇది మహా మంత్రంగా ప్రసిద్ధి పొందింది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిలయంగా పరిఢవిల్లుతోంది. వేలాది మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. 2021లో ఈ ఆలయం ప్రారంభమైంది. శ్రీ శ్రీ రాధా మాధవ, శ్రీ శ్రీ గౌర నితాయి , శ్రీ శ్రీ జగన్నాథ్ బలదేవ్ సుభద్రలకు ఇది నిలయం. ఇక్కడ శ్రీ కృష్ణ జన్మాష్టమి, శ్రీ రాధాష్టమి, శ్రీ నరసింహ చతుర్దశి, శ్రీ వైకుంఠ ఏకాదశి, శ్రీ గౌర పూర్ణిమ, శ్రీ రామ నవమి వంటి అన్ని ప్రధాన వైష్ణవ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుతారు. ఇక్కడ ప్రతినిత్యం అన్న ప్రసాద వితరణ జరుతుతుంది. 2 వేల మందికి పైగా భక్తులకు దీన్ని పంపిణీ చేస్తారు. దీంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్య ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద మార్గదర్శకత్వంలో సేంద్రీయ వ్యవసాయ ప్రాజెక్టుల అభివృద్ధి, గో సంరక్షణ, భగవద్గీత, భాగవతం వంటి వేద పుస్తకాల పంపిణీ చేపడుతున్నారు. అలాగే, ప్రజలు సరళమైన, సంతోషకరమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన బోధనలను చేస్తున్నారు. లక్షలాది మందిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేందుకు అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం వేదికగా నిలుస్తోంది.

# మంత్రులుగా చేశామని చెప్పుకోవడానికి వాళ్లకు అర్హత ఉందా..?

# భారాస నేతలపై సీఎం ఫైర్

హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయని.. వాటిని గౌరవించాల్సిన బాధ్యత మన అందరిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సీఎం శాసన సభలో మాట్లాడారు. "గవర్నర్ ప్రసంగం లేకుండానే 2022 బడ్జెట్ సమావేశాలు ప్రారంభించారు. 2023లోనూ గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు ప్రారంభించాలనుకున్నారు. కోర్టు కఠినంగా వ్యవహరించడంతో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిని మనం గౌరవించాలి. ప్రభుత్వాలు వ్యక్తుల ఆస్తులు కాదు. బలహీన వర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవహేళన చేసింది. మంత్రివర్గం ఆమోదించిన అంశాలనే ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. మాది కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇది ప్రజా పాలన. మా విధానం. మా ఆలోచనలు.. మేం ప్రజలకు చేసిన పనులు మాత్రమే గవర్నర్ ప్రసంగంలో పొందుపరుస్తాం. అవగాహన లేని వాళ్లు మంత్రులుగా చేశామని చెప్పుకోవడానికి అర్హత ఉందా? అని నేను అడుగుతున్నాను. పదేళ్ల భారాస పాలనలో నాటి మంత్రివర్గం ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగం ఉందా? వాళ్లకు గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదు. మహిళా గవర్నర్‌ను అవమానించారు.. ఆ తప్పు మేం చేయం. గవర్నర్ వ్యవస్థను గౌరవించే బాధ్యత మాది. గవర్నర్ ప్రసంగంలో సూచనలు చేస్తే ప్రభుత్వం స్వీకరిస్తుంది" అని రేవంత్ అన్నారు.

* కేసీఆర్ వందేళ్లు ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలి..

"రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి రైతు కమిషన్ వేశాం. చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చేందుకు గల్లీ నుంచి దిల్లీ వరకూ కొట్లాడుతున్నాం. ఆనాడు అధికార పార్టీగా భారాసకు స్ట్రేచర్



ఉండేది. 2023లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజలు స్ట్రేచర్ ఇచ్చారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా ఇచ్చి మార్చురీకి పంపించారు. భారాస నేడు మార్చురిలో ఉందని నేను చెప్పాను. అందులో తప్పేముంది. పెద్దాయన కేసీఆర్‌ను నేను అన్నట్లుగా కేటీఆర్, హరీశ్‌రావు చిత్రీకరించారు. అంత కుంచిత స్వభావం నాకు లేదు. కేసీఆర్ వద్ద ఉన్న కుర్చీని 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు గుంజుకుని నన్ను కూర్చోబెట్టారు. చంద్రశేఖర్ రావు వద్ద తీసుకోవడానికి ఇంకేముంది. వారి వద్ద ఉన్నది ప్రధాన ప్రతిపక్ష హోదా.. ఆ హోదా కేటీఆర్ లేదా హరీశ్‌రావుకు కావాలి. తప్పుడు మాటలు నాకు ఆపాదిస్తున్నారు. కేసీఆర్ వందేళ్లు ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలి.. నేను ఇక్కడే ఉండాలి. కేసీఆర్ సూచనలు చేస్తూనే ఉండాలి.. నేను మంచి పరిపాలన అందిస్తూనే ఉండాలి" అని సీఎం అన్నారు. పదేళ్ల భారాస పాలనలో రైతులకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం ప్రకటించారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

## : భాజపా ఎమ్మెల్యేలకు కిషన్‌రెడ్డి దిశానిర్దేశం

హైదరాబాద్:తెలంగాణ శాసనసభలో అనుసరించాల్సిన వ్యూహాలపై భాజపా ఎమ్మెల్యేలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా గళమెత్తాలన్నారు. సభలో



మాట్లాడే సమయంలో ఉపయోగించే భాష విషయంలో నిబంధనలకు విరుద్ధంగా కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మాట్లాడాలనుకునే అంశాన్ని ముందుగానే నిర్ణయించుకొని.. ఎవరు ఏ అంశంపై మాట్లాడాలో ప్లాన్ చేసుకొని అసెంబ్లీలో మాట్లాడే విధంగా సన్నద్ధం కావాలని కిషన్ రెడ్డి సూచించారు.

## కోకాపేటలో అగ్నిప్రమాదం.. ఐటీ ఉద్యోగులకు తీవ్ర గాయాలు

హైదరాబాద్: కోకాపేటలో ఉన్న జీఏఆర్ భవనంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ఐటీ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన సహోద్యోగులు గాయపడిన వారిని వెంటనే సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



## భారాస.. సోషల్ మీడియా ద్వారా

## లబ్ధి పొందాలని చూస్తోంది : మంత్రి సీతక్క

హైదరాబాద్: భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. "సోషల్ మీడియా ద్వారా నేను కూడా చాలా ఇబ్బంది పడ్డాను. నాపై పెట్టిన పోస్టులకు మానసికంగా ధైర్యం కోల్పోయా. నిజాయతీగా పనిచేసే మహిళల ధైర్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీస్తుంది. ఒక మంచి పని చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరో పది మంది సాయం చేసేలా ఉండాలి. మార్చురీ అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదు.. ఒక పార్టీని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలి.. కానీ, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడమేంటి? బాడీ షేమింగ్ చేయకూడదు. సోషల్ మీడియాకి హద్దు ఉండాలి. అబద్ధాలకి బ్రాండ్ అంబాసిడర్‌గా భారాస మారింది. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజం అవుతుందని ఆ పార్టీ నమ్ముతోంది. సోషల్ మీడియాలో భాజపా, భారాస అన్నదమ్ములు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల విషయంలో కట్టడికి ఒక చట్టం తీసుకు రావాలి" అని సీతక్క అన్నారు.



## తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకోవచ్చు




రెజిమెంటల్ బజార్ : రొమ్ము క్యాన్సర్‌పై యూట్యూబ్ వేదికగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో వీక్షించిన నేపథ్యంలో కిమ్స్ ఆస్పత్రి రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు రఘురాం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందించారు. కిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రశంస పత్రాన్ని రఘురాం అందుకున్నారు. రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని వెంకయ్యనాయుడు ప్రశంసించారు. "తొలి దశలోనే ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తే అధునాతన వైద్య పద్ధతులను అను సరించి నయం చేయవచ్చు. అందుకోసం ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఏకకాలంలో వందలాది మందికి అవగాహన కల్పించడంలో రఘురాం పాత్ర గొప్పది. ప్రస్తుత సమాజంలో వినోదానికే వాడుతున్న సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పిం చడం శుభ పరిణామం. మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్న అభిరుచి కలిగి ఉండడం దేశానికి శ్రేయస్కరం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవాలంటే శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఆహార అలవాట్లను నియంత్రణలో ఉంచుకోవాలి. అప్పుడే వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుంది. భారత ప్రజలు మాతృభాషకు తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది" అని వెంకయ్యనాయుడు అన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై డాక్టర్ రఘురాం ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మౌంట్ అబూలో బ్రహ్మకుమారిలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా.. దాన్ని 11,000 మంది యూట్యూబ్ వేదికగా చూశారని తెలిపారు. ఉషా లక్ష్మి రొమ్ము క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడొచ్చని అన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలంతా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే స్క్రీనింగ్ చేసుకోవాలని సూచించారు. తన తల్లి కూడా ఈ వ్యాధితో బాధపడినట్లు తెలిపారు. ఆమె స్ఫూర్తితోనే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## సభాపతిని అగౌరవపరచాలన్న ఉద్దేశం మాకు ఎప్పుడూ లేదు: హరీశ్‌రావు

హైదరాబాద్: సభాపతిపై జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జగదీశ్‌రెడ్డికి అవకాశం ఉంటే వివరణ ఇచ్చేవారని చెప్పారు. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. "సభాపతి అంటే మాకు ఎంతో గౌరవం. ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు



సహకరించాం. సభా సంప్రదాయాలు పాటించాలని మాకు మా అధినేత ఎప్పుడూ చెబుతుంటారు. సభాపతిని అగౌరవపరచాలన్న ఉద్దేశం మాకు ఎప్పుడూ లేదు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను పునఃపరిశీలించాలని కోరుతున్నాం" అని హరీశ్‌రావు తెలిపారు.

## డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు.. నిందితుడి అరెస్టు

హైదరాబాద్: డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న దుబాయ్‌కి చెందిన మహమ్మద్ జుబైర్ అహ్మద్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం నిందితుడు దుబాయ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రాగానే.. ముందస్తు సమాచారం మేరకు ఎయిర్‌పోర్టు అధికారులు అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌కి చెందిన ఓ వ్యక్తి నుంచి డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ. 55 లక్షలు కాజేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు



చేపట్టారు. ఇలా డిజిటల్ అరెస్టు పేరుతో కాజేసిన సొమ్మును వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా దుబాయ్‌కి తరలించేవాడని దర్యాప్తులో తేలింది. గతంలో నిందితుడిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు సైతం జారీ చేశారు. నిందితుడిపై దేశ వ్యాప్తంగా 124 కేసులు నమోదు కాగా.. రూ. కోట్లల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలో నిందితుడిపై 24 కేసులు నమోదయ్యాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# సమ్మర్ కష్టాలకు స్మార్ట్‌గా చెక్‌పెట్టేద్దాం!



'అయ్యో వచ్చే వేసవి.. తెచ్చే తిప్పలు' అనే మాటలకు ఇకపై స్మార్ట్‌గా చెక్ పెట్టొచ్చు. మండే ఎండల నుంచి తప్పించుకోవడానికి చల్లదనం కోసం, ప్రజలు రకరకాల చిట్కాలను పాటిస్తుంటారు. ఆ చిట్కాల్లో ఈ గాడ్జెట్లనూ చేర్చి, సమ్మర్‌కు స్మార్ట్‌గా, కూల్‌గా మార్చేయచ్చు. ఇందుకోసం ఉపయోగపడే కొన్ని లేటెస్ట్ గాడ్జెట్ల వివరాలు

### సన్‌స్క్రీన్ టెస్టర్

వేసవిలో మీ చర్మానికి రక్షణ ఉందా? లేదా? అని ఈ బుల్లి సన్‌స్క్రీన్ టెస్టర్ ద్వారా ఇట్టే తెలుసుకోవచ్చు. చిన్న పెన్‌డ్రైవ్‌లా కనిపించే ఈ పరికరం, నిజానికి ఒక ప్రత్యేకమైన కెమెరా. వేసవిలో ఒళ్లంతా చెమటలు పట్టిన తర్వాత, ఈత కొట్టినప్పుడు, రుమాలుతో ముఖం తుడుచుకున్నప్పుడు, రాసుకున్న క్రీమ్స్ చర్మంపై అక్కడక్కడ మిస్ అవుతుంటుంది. అలాంటప్పుడు ఈ చిన్న కెమెరాలో నుంచి చూసినట్లయితే, సన్‌స్క్రీన్ క్రీమ్ రక్షణ తొలగిపోయిన ప్రదేశాలను డార్క్‌గా చూపిస్తుంది. ఇది పూర్తిగా వాటర్ ప్రూఫ్, అల్ట్రా పోర్టబుల్. దీని ధర రూ.10,311 మాత్రమే!



### స్మార్ట్ వాటర్ బాటిల్

వేసవిలో హైడ్రేటెడ్‌గా ఉండటం తప్పనిసరి. పని ఒత్తిడిలో పడి చాలామంది తరచుగా నీళ్లు తాగటం మరచిపోతుంటారు. ఈ స్మార్ట్ వాటర్ బాటిల్‌తో మీరు హైడ్రేటెడ్‌గా ఉండొచ్చు. ఈ బాటిల్ మీరు నీటిని తీసుకోవడాన్ని ట్రాక్ చేస్తుంది.

అంతే కాకుండా, అవసరమైనప్పుడల్లా మిమ్మల్ని చల్లబరచడానికి మంచి కూలింగ్ వాటర్‌ను అందిస్తుంది. అలాగే వ్యాయామాలు, హైకింగ్‌లు, బీచ్ దేస్‌కి తీసుకెళ్లడానికి ఈ వాటర్ బాటిల్ చాలా అనువుగా ఉంటుంది. ఇలాంటి బాటిల్స్ మార్కెట్‌లో చాలానే దొరుకుతున్నాయి. రివ్యూలను చూసి తీసుకోవటం మంచిది.

### క్యాప్ విత్ ఫ్యాన్

వేసవిలో చాలామంది ఉపయోగించే క్యాప్స్ కూడా స్మార్ట్‌గా మారాయి. ఈ



క్యాప్స్‌కు అటాచబుల్ మిని ఫ్యాన్ వస్తుంది. ముఖానికి కప్పుకొనే చోట ఈ ఫ్యాన్ ఉంటుంది. దీనికి సోలార్ ప్యానెల్స్ సహాయంతో పవర్ సరఫరా అవుతుంది. క్యాప్ ఎండకు ఎక్స్‌పోజ్ కాగానే ఆటోమేటిక్‌గా ఈ ఫ్యాన్‌లు పనిచేస్తాయి. వీటిల్లో కొన్ని చార్జబుల్ స్టయిల్ మోడల్స్‌లోనూ లభిస్తున్నాయి. కంపెనీల్లో క్వాలిటీ బట్టి ధరల్లో తేడా ఉండొచ్చు. రివ్యూలను పరిశీలించి, కొనుగోలు చేసుకోవచ్చు.

### చేతిలోనే ఫ్యాన్స్

విసనకర్రలను ఎక్కడికైనా తేలికగా తీసుకుపోగలిగినట్లే, ఈ మినీ ఫ్యాన్స్‌ను కూడా ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. స్మార్ట్‌ఫోన్ , పవర్ బ్యాంకు మాదిరిగానే ఈ మినీ ఫ్యాన్స్‌ను కూడా పాకెట్‌లో లేదా హ్యాండ్‌బ్యాగులో పెట్టుకోవచ్చు. మండుటెండల్లో ఇవి ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తాయి.

మల్టిపుల్ ఫ్యాన్ స్పీడ్స్‌కు తోడు రీచార్జబుల్ బ్యాటరీలు వీటిలో ఉంటాయి. వీటిలో కొన్ని యూఎస్‌బీ పవర్ సోర్స్‌కు కనెక్ట్ చేసుకుని కూడా వాడుకోవచ్చు. ఇలాంటి మినీ ఫ్యాన్స్‌లోనూ వివిధ రకాలు, స్టయిల్స్ ఉంటాయి. కొనుగోలు చేసే ముందు కాస్త నాణ్యత ప్రమాణాలను పరిశీలించడం మంచిది.







# రంజాన్ ఆశయం!

## కేవలం ఉపవాసాలు, నమాజులు కాదు..

రంజాన్ మాసం విశ్వాస కుసుమాలను వికసింపజేసే వరాల వసంతం. దైవ ప్రసన్నత, దైవభీతి పరాయణతల సాధనకు అనుకూలమైన రుతువు. దేవుని కారుణ్య కడలిని.ఆ యన మన్నింపు కెరటాలను ఉప్పొంగజేసే మహోజ్వలమైన మాసం. రంజాన్ ఆరంభం నుండి అంతం వరకు అపార దైవానుగ్రహాలను వర్షింపజేసే శుభాల సీజన్.

ఈ శుభ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ, తరావీహ్ నమాజులు చేస్తూ, ఖురాన్ పారాయణం చేస్తూ, బీదసాదలకు సహాయం చేస్తూ పూర్తి జీవితాన్ని దేవుని విధేయత పరిధిలో గడిపేవారు ఎంతో అదష్టవంతులు. అయితే కేవలం ఆరాధనలు చేసినంత మాత్రాన మనం రంజాన్ శుభాలను పొందలేం. రంజాన్ శుభాలకు అర్హులు కావాలంటే, అంతరంగాల్లో దైవభీతి దృఢంగా నాటుకోవాలి. దాని ప్రభావం మన దైనందిన జీవితంలోనూ కనిపించాలి. అంటే, అన్ని విధాల చెడులను వదలిపెట్టి పరిశుద్ధమైన జీవితం గడపాలి. 'ఎవరైనా ఉపవాసం ఉండి కూడా అబద్ధాలు చెప్పడం, వాటిని అమలు చేయడం వదలుకోకపోతే ఆ వ్యక్తి అన్నపానీయాల్ని వదలిపెట్టడం పట్ల దేవునికి ఎలాంటి ఆసక్తి ఉండదు' అని ప్రవక్త(సల్లం) ప్రవచించారు. ఉపవాసాలు పాటిస్తూ, నమాజులు చేస్తూ కూడా అబద్ధం చెప్పడం, అబద్ధాన్ని ఆచరించడం మానుకోని వ్యక్తి కష్టపడినా ఫలితం దక్కని రైతులాంటివాడు. ఆ రైతు తీవ్రమైన ఎండలో చెమటలు చిందిస్తూ నాగలితో పొలం దున్ని విత్తనాలు చల్లుతాడు. అవి మొలకెత్తిన తర్వాత పెరగటానికి కావలసిన సదుపాయాలన్నీ కలగజేస్తాడు. రాత్రిళ్ళు మేల్కొని పొలానికి కాపలా కూడా కాస్తాడు.

కానీ పంట పండి కొన్ని రోజుల్లో చేతికి వస్తుందనగా దాన్ని వదిలేస్తాడు. దాంతో ఆ పొలం ఒక వైపు కలుపు మొక్కలు, చీడ పురుగులతో, మరోవైపు పక్షులు, పశువులు అడపాదడపా మేయడంతో పంట చేతికి రాకముందే పూర్తిగా నాశనం అవుతుంది. ఈ విషయాన్నే దైవప్రవక్త(సల్లం) ఇలా తెలిపారు.

'ఎందరో ఉపవాసం పాటించే వారికి తమ ఉపవాసాల ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు. అలాగే ఎందరో తరావీహ్ నమాజ్ చేసే వారికి తమ తరావీహ్ నమాజ్ ద్వారా జాగరణ తప్ప మరేమీ ప్రాప్తం కాదు.'

దైవభీతి పరాయణత మస్జిద్ లోనే కాదు, మస్జిద్ వెలుపల బజారుల్లో, ఇండ్లల్లో, దుకాణాల్లో, కార్యాలయాల్లో,





కార్ఖానాల్లో కూడా కనిపించాలి. ఏదైనా వ్యవహారంలో తప్పు చేస్తున్నప్పుడు దేవుడు చూస్తున్నాడనే భావన కలగాలి. మనిషిని చెడులకు దూరంగా ఉంచగలిగేది కేవలం దైవభయమే. హృదయంలో చెడు పట్ల వెగటు, మంచి పట్ల అభిమానం జనించాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, బయటి ఒత్తిళ్ళకు లొంగకుండా కేవలం దైవ ప్రసన్నత కోసం చెడులను మాని మంచిని అవలంబించాలన్న కోరిక కలగాలి. అధర్మ విషయాలను పూర్తిగా వదిలేసి దైవధర్మం మోపిన బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వహిస్తూ ఉండాలి.

ఈ విధేయతా భావం రంజాన్ నెల గడిచిపోగానే అంతరించకుండా సంవత్సరంలోని మిగిలిన పదకొండు నెలలు కూడా సజీవంగా ఉండేలా రమజాను ఉపవాసాలు శాశ్వత శిక్షణ ఇస్తాయి. హృదయంలో దైవభీతి పరాయణత, జీవిత వ్యవహారాలపై దాని ప్రభావం తాత్కాలికంగా కాకుండా జీవితాంతం ఉండినప్పుడే రంజాన్ అసలైన ఆశయం నెరవేరుతుంది.

# సమ్మర్‌లో స్లిమ్‌గా మారడం ఈజీ..! ఎలాగంటే..

వ్యాయామంతో బరువు తగ్గించుకునేందుకు ఇదే అనువైన సమయమంటున్నారు వైద్య నిపుణులు. ప్రతిరోజూ వ్యాయామం, యోగా చేస్తూ, ఆహార నియమాలు పాటిస్తూ వేసవిలో స్లిమ్‌గా మారొచ్చంటున్నారు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పటికే వేసవి ప్రారంభమైంది. జిమ్ చేయడానికి సిద్ధమవుదాం.

### నడక ఎంతో ప్రయోజనం

ప్రస్తుత యాంత్రిక జీవనంలో అనేక రకాల పనుల కారణంగా తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతోంది. దీన్ని నడకతో అధిగమించవచ్చని వైద్యులు చెబుతున్నారు. సాయంత్రం కంటే



మార్నింగ్ వాక్ చాలా మంచిది. ఉదయం స్వచ్ఛమైన వాతావరణంతో పాటు, ఆక్సిజన్ స్థాయి అధికంగా ఉంటుంది. సున్నితంగా సూర్యకిరణాలు పడుతుంటే మనసుకు హాయినిస్తుంది. అయితే జాగింగ్ సమయంలో కొన్ని జాగ్రత్తలు తప్పవంటున్నారు. నీరసం వచ్చే వరకూ జాగింగ్ చేయడం ప్రమాదకరమే. దాహం వేస్తే అందుబాటులో తాగునీటిని ఉంచుకోవాలి.

### శీతల ప్రాణాయామం

శీతల ప్రాణాయామం చేస్తే కొంత వరకూ ఎండల ప్రతాపాన్ని తట్టుకునే శక్తి శరీరానికి అందడంతోపాటు, బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. నాలుకను మడిచి, నోటి ద్వారా గాలి పీల్చి ముక్కుద్వారా వదిలే ప్రక్రియే శీతల ప్రాణా యామం. ఉదయం 7 గంటల లోపు 5 నిమిషాలు ఈ వ్యాయామం చేయడం మంచిదని యోగా నిపుణులు సూచిస్తున్నారు.

## జాక్‌పాట్ కొట్టిన గోల్డ్ బాండ్స్ ఇన్వెస్టర్లు..

# మూడింతల లాభం!




**న్యూఢిల్లీ:** సావరిన్ గోల్డ్ బాండ్ 2016-17 సిరీస్‌లో పెట్టుబడిదారులు భారీ లాభాలను ఆర్జించారు. మార్చి 2017లో ఈ బాండ్ జారీ సమయంలో గ్రాముకు రూ. 2,943 చొప్పున కొనుగోలు చేసిన బంగారం.. ఇప్పుడు గ్రాముకు రూ. 8,624కి చేరుకుంది. అంటే ఈ పెట్టుబడిదారులు 3 రెట్లు ఎక్కువ రాబడిని పొందారు. ఇది 193% భారీ పెరుగుదలను చూపుతుంది.

2016-17 సిరీస్ బాండ్లకు సంబంధించిన రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. మార్చి 17ను మెచ్యూర్ తేదీగా నిర్ణయించింది. దీంతో అప్పట్లో పెట్టుబడులు చేసిన వారు దాదాపు మూడింతలు లాభం పొందనున్నారు. ఇదిలా ఉండగా, దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఈ స్కీమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి కాలపరిమితి 8 సంవత్సరాలు. 2017లో మార్చిలో జారీ చేసిన నాలుగో విడత బాండ్లకు మెచ్యూరిటీ ధరను తాజాగా ఆర్‌బీఐ ప్రకటించింది. అప్పట్లో గ్రాము రూ.2,943 చొప్పున బాండ్లు జారీ చేయగా.. తాజా ధరను రూ.8624గా పేర్కొంది. అంటే అప్పట్లో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు దాదాపు రూ.3 లక్షలు లాభం రానుంది.

సావరిన్ గోల్డ్ బాండ్లు అనేవి భారత ప్రభుత్వం ఆర్బీఐ ద్వారా జారీ చేసే ప్రభుత్వ బాండ్లు. వీటిని గ్రాము ప్రాతిపదికన కొనుగోలు చేస్తారు. మెచ్యూరిటీ తర్వాత వీటిని నగదు రూపంలో రీడీమ్ చేస్తారు. సావరిన్ గ్యారెంటీ ఉంటుంది. అందుకే పెట్టుబడిదారులు ఎలాంటి డిఫాల్ట్ ప్రమాదంలో ఉండరు.

సావరిన్ గోల్డ్ బాండ్‌లను మెచ్యూరిటీకి ముందు సెకండరీ మార్కెట్లో విక్రయిస్తే, వాటి హోల్డింగ్ వ్యవధిని బట్టి మూలధన లాభాల పన్ను విధిస్తారు. ఇటీవలి నిబంధనల ప్రకారం.. 12 నెలల కంటే ఎక్కువ కాలం పాటు ఉంచుకుంటే మూలధన లాభాలపై దీర్ఘకాలిక పన్ను విధించబడుతుంది. ఎటువంటి ఇండెక్సేషన్ ప్రయోజనాలు లేకుండా 12.5 శాతం పన్ను విధిస్తారు. లేకపోతే వాటికి స్లాబ్ రేట్ల వద్ద స్వల్పకాలిక మూలధన లాభాలుగా పన్ను విధిస్తారని నిపుణులు చెబుతున్నారు.

## అన్ని వయసుల వినియోగదారుల అత్యుత్తమ ఎంపికగా పతంజలి బ్రాండ్




**న్యూఢిల్లీ:** యోగా గురు బాబా రాందేవ్ స్థాపించిన పతంజలి ఆయుర్వేద సంస్థ భారతీయ ఆయుర్వేద ఆరోగ్య రంగంలో తన స్థాయిని పెంచుకుని, ప్రత్యామ్నాయ వైద్య రంగంలో ప్రముఖంగా ఎదిగింది. బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణ పతంజలి స్థాపన ద్వారా ఆయుర్వేదాన్ని ప్రజల దైనందిన జీవిత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. సహజమైన ఆయుర్వేద చికిత్సల ద్వారా నమ్మదగిన ప్రత్యామ్నాయాన్ని అందించారు. తమ ఉత్పత్తులను సహజ, సేంద్రీయ పదార్థాలతో తయారు చేస్తుందని పతంజలి చెబుతోంది. ఎలాంటి సింథటిక్ రసాయనాలు తమ ఉత్పత్తులలో ఉండవని పతంజలి పేర్కొంది.. ఆయుర్వేద మూలికలు చెట్ల ఆధారిత పదార్థాలను మాత్రమే ఉపయోగించడం వల్ల ఉత్పత్తులు సురక్షితమైనవే అన్న భరోసాని పతంజలి ఇవ్వగలుగుతుంది

పతంజలి ఉత్పత్తులు రక్తపోటు, డయాబెటిస్, థైరాయిడ్, ఆస్తమా, ఆర్థరైటిస్, ఊబకాయం, కాలేయ, కిడ్నీ సంబంధిత సమస్యలు , క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల నుండి వేల మందికి ఉపశమనం కలిగించాయని సంస్థ చెబుతోంది. పురాతన ఆయుర్వేదాన్ని పునరుజ్జీవింపజేసేందుకు చేసిన కృషే.. పతంజలి ఈ ఘనతను సాధించడానికి గల ముఖ్య కారణాల్లో ఒకటని ఆ సంస్థ చెబుతోంది.

### ఆయుర్వేదం - సంప్రదాయ వైద్య విధానం

ఆయుర్వేదం శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతపై ఆధారపడిన సంప్రదాయ వైద్య విధానం. పతంజలి ఉత్పత్తులు ఈ ప్రాచీన వైద్యాన్ని ఆధునిక జీవనశైలికి అనుగుణంగా సమగ్ర వైద్యం అందించేందుకు రూపొందించబడ్డాయి. వినియోగదారుల అనుభవాలు, ఆదరణ, సరసమైన ధరలు, విస్తృతంగా లభ్యత - ఇవన్నీ పతంజలిని నమ్మదగిన బ్రాండ్‌గా నిలబెట్టాయి.

## 7 నెలల కనిష్టానికి చిల్లర ద్రవ్యోల్బణం

### దేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గొచ్చు!



**న్యూఢిల్లీ:** హోలీ, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో దేశ ప్రజలకు పెద్ద శుభవార్త. గత నెల (2025 ఫిబ్రవరి)లో, భారతదేశ రిటైల్ ఇన్‌ఫ్లేషన్ రేటు 7 నెలల కనిష్ట స్థాయికి చేరుకుంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా లెక్కించే చిల్లర ద్రవ్యోల్బణం రేటు ఫిబ్రవరిలో 3.61 శాతంగా నమోదైంది. ఇది జనవరి కంటే 0.65 శాతం తక్కువ. గత ఏడాది జులైలో నమోదైన 3.54 శాతం తర్వాత, ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన సంఖ్యే అత్యల్పం. దేశంలో ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ట స్థాయికి దిగి రావడానికి ప్రధాన కారణం ఆహార ధరలు తగ్గడం. నెల క్రితం, 2025 జనవరిలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 4.26 శాతంగా ఉండగాబీ ఏడాది క్రితం, 2024 ఫిబ్రవరిలో ఇది 5.09 శాతంగా ఉంది.

### ఆహార ద్రవ్యోల్బణం తగ్గుదల

2025 ఫిబ్రవరిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 3.75 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జనవరిలోని 5.53 శాతంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 222 బేసిస్ పాయింట్లు తగ్గడం విశేషం. 2023 మే నెల తర్వాత, మళ్లీ 2025 ఫిబ్రవరిలో ఇది అత్యల్ప స్థాయికి చేరుకుంది. ఫిబ్రవరిలో కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పుధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తుల ధరలు తగ్గడం ఈ తగ్గుదలలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో అత్యధికంగా తగ్గిన ఆహార ఉత్పత్తులు - అల్లం (-35.81%), జీలకర్ర (-28.77%), టమోటా (-28.51%), కాలీఫ్లవర్ (-21.19%), వెల్లుల్లి (-20.32%). గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంధన ధరల్లోనూ ఉపశమనం లభించింది, ఇంటి బడ్జెట్లపై ఒత్తిడి తగ్గింది. ఇంధన ద్రవ్యోల్బణం రేటు 1.33 శాతం తగ్గింది. 2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో కొన్ని ధరలు పెరిగాయి. అవి - కొబ్బరి నూనె (ం54.48%), కొబ్బరి (ం41.61%), ఉల్లిపాయలు (ం30.42%), పసిడి (35.56%), వెండి (ం30.89%).

## సూర్యకుమార్‌కు ముంబయి

# జట్టు పగ్గాలు?

### పాండ్య, బుమ్రా గైర్హాజరీతో నిర్ణయం



**న్యూఢిల్లీ:** 2025 ఐపీఎల్‌కు రంగం సిద్ధమైంది. మరో వారం రోజుల్లో టోర్నమెంట్ ప్రారంభం కానుంది. మార్చి 22న కోల్‌కతా- ఆర్సీబీ మ్యాచ్‌తో ఈ ఎడిషన్‌కు తెర లేవనుంది. ఈ క్రమంలో ఈసారి ఏయే జట్టుకు ఎవరు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారో క్లారిటీ వచ్చేసింది. అయితే మోస్ట్ సక్సెస్‌ఫుల్ ముంబయి ఇండియన్స్ జట్టు కెప్టెన్సీలో మాత్రం మార్పు జరిగే ఛాన్స్ ఉంది! ఎందుకంటే ఈ ఎడిషన్‌లో ముంబయి మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌కు చెన్నై చెపాక్ స్టేడియం వేదిక కానుంది. అయితే ఈ మ్యాచ్‌లో ముంబయి జట్టుకు రెగ్యులర్ సారథి హార్దిక్ పాండ్య కాకుండా స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించే ఛాన్స్ ఉంది. ఆ మ్యాచ్‌కు పాండ్య దూరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.2024 ఎడిషన్‌లో ముంబయి మూడుసార్లు స్లో ఓవర్ రేట్‌కు గురైంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం సింగిల్ సీజన్‌లో ఓ జట్టు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు స్లో ఓవర్ రేట్‌కు గురైతే, ఆ టీమ్ కెప్టెన్‌కు రూ.30 లక్షల జరిమానా, ఒక మ్యాచ్ నిషేధం పడుతుంది. ఈ క్రమంలో గత సీజన్ లీగ్ దశలోనే హార్దిక్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. అయితే ఆ సీజన్‌లో ముంబయి క్వాలిఫైయర్‌కు అర్హత సాధించకపోవడం వల్ల, హార్దిక్‌పై సస్పెన్షన్ కొనసాగుతూ వచ్చింది. ఇలా ఐపీఎల్ నిబంధనలతో పాండ్యకు షాక్ తగిలినట్లైంది! దీంతో తాజా ఎడిషన్‌లో తొలి మ్యాచ్‌కు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా కూడా గాయం కారణంగా తొలి రౌండ్ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో పాండ్య, బుమ్రా గైర్హాజరీలో సూర్య కెప్టెన్‌గా జట్టును నడిపించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు జట్టులో మోస్ట్ సక్సెస్?ఫుల్ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నప్పటికీ, అకడు సారథ్యం బాధ్యతలు తీసుకోకపోవచ్చు. అందుకే మేనేజ్‌మెంట్ కూడా సూర్యకే తాత్కాలిక బాధ్యతలు అప్పగించే ఛాన్స్ ఉంది. ఇక మిగిలిన సీజన్ మొత్తానికి హార్దిక్ మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

### ముంబయి జట్టు ఐపీఎల్ 2025:

రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, నమన్ ధీర్, రాబిన్ మింజ్, కరణ్ శర్మ, దీపక్ చాహర్, ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్, అశ్వని కుమార్, మిచెల్ సాంట్నర్, రీస్ టోప్లీ, శ్రీజిత్, రాజ్ అంగద్ బావా, బెవాన్ జాకబ్స్, వెంకట పెన్మెట్సా, అర్జున్ తెందూల్కర్, లిజాడ్ విలియమ్స్, విఘ్నేష్ పుత్తూరు, ముజీబ్ అర్ రహ్మాన్.

## నా దినచర్య, అభ్యాసాన్ని మార్చుకున్నా

### భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి



**న్యూఢిల్లీ:** భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం టీమ్ ఇండియాలో సుపరిచితమైన పేరు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం యశస్వి జైస్వాల్ స్థానంలో చివరి నిమిషంలో అతన్ని జట్టులోకి తీసుకున్నారు. జట్టులోకి వచ్చినందుకు అతను సెలెక్టర్లు , కెప్టెన్ రోహిత్ శర్మ నుండి విమర్శలను కూడా ఎదుర్కొన్నాడు. అయితే, అతను ఆటతీరుతో అందర్నీ ఆకట్టుకున్నాడు. జట్టు టైటిల్ గెలవడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. 2021 టీ20 ప్రపంచ కప్ నుంచి టీమిండియా ముందుగానే నిష్క్రమించిన తర్వాత తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని అతను వెల్లడించిన షాకింగ్ విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ సమయంలో అతను తన జీవితంలోని కొన్ని కఠినమైన అనుభవాలను పంచుకున్నాడు. టోర్నమెంట్ నుంచి భారత్ నిష్క్రమించిన తర్వాత, భారతదేశానికి తిరిగి రావద్దని తనను హెచ్చరించారని, చెన్నైలోని తన ఇంట్లో వారిని కూడా బెదిరించినట్లు వరుణ్ వెల్లడించాడు. 'ఇది నాకు చెడ్డ సమయం' అని వరుణ్ ఒక యూట్యూబ్ షోలో ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ప్రపంచ కప్‌కు ఎంపిక కావడానికి నేను న్యాయం చేయలేకపోతున్నానని భావించి నేను నిరాశకు గురయ్యాను. నేను ఒక్క వికెట్ కూడా తీయలేకపోయానని బాధపడ్డాను. ఆ తర్వాత మూడు సంవత్సరాలు నన్ను ఎంపిక చేయలేదు. కాబట్టి, నా అరంగేట్రం కంటే జట్టులోకి తిరిగి వచ్చే మార్గం చాలా కష్టమని నేను భావిస్తున్నాను. 2021 %%20 ప్రపంచ కప్ తర్వాత జట్టు నుండి తొలగించిన తర్వాత తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగిసిపోవచ్చని వరుణ్ భావించినట్లు తెలిపాడు. రెండవ అవకాశం లభిస్తుందనే హామీ లేకుండా తాను ఎలా మార్పును ఎదుర్కోవలసి వచ్చిందో.. కష్టపడి పనిచేయాల్సి వచ్చిందో వివరించాడు. '2021 సంవత్సరం తర్వాత నేను నా గురించి చాలా విషయాలు మార్చుకోవాల్సి వచ్చింది. నా దినచర్య, అభ్యాసాన్ని మార్చుకోవలసి వచ్చింది. గతంలో నేను ఒక సెషన్‌లో 50 బంతులు ప్రాక్టీస్ చేసేవాడిని, తర్వాత దాన్ని రెట్టింపు చేశాను. సెలెక్టర్లు నన్ను తిరిగి పిలుస్తారో లేదో తెలియకపోవడం కష్టంగా ఉంది. మూడవ సంవత్సరం తర్వాత, అంతా అయిపోయిందని నాకు అనిపించింది. మేము ఐపీఎల్ గెలిచాము, ఆపై నాకు కాల్ వచ్చింది. దీనితో నేను చాలా సంతోషించాను అని తెలిపాడు.

## ఈసారి మరింత బలంగా టైటాన్స్

### మెరికల్లాంటి ప్లేయర్లను కొనుగోలు చేసిన గుజరాత్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్లో 2022లో ప్రవేశించిన గుజరాత్ టైటాన్స్ జట్టు.. కొద్ది కాలంలోనే తన ఆటతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆడిన తొలి సీజన్ లో నే విజేతగా నిలిచిన టైటాన్స్.. తర్వాత సీజన్లో రన్నరప్ గా నిలిచింది. ఇక గతేడాది మాత్రం ఎనిమిదో స్థానంలో నిరాశపర్చింది. తొలి రెండు సీజన్లలో అటు బ్యాట్, ఇటు బంతితో కెప్టెన్ గా హార్దిక్ పాండ్యా జట్టును ముందుకు నడిపించాడు. గత సీజన్ లో అతను వెళ్లిపోవడంతో శుభమాన్ గిల్ సారథ్య బాధ్యతలు మోశాడు. ఇక గతేడాది మెగావేలంలో తాము ఎక్కడైతే బలహీనంగా ఉన్నామో, అక్కడ ఫోకస్ పెట్టి, మెరికల్లాంటి ప్లేయర్లను కొనుగోలు చేయడం ప్లస్ పాయింట్. పేపర్ పై చూస్తే చాలా బలంగా కనిపిస్తున్న టైటాన్స్, మైదానంలో అలాంటి ప్రదర్శన చేయాలని ఆ జట్టు అభిమానులు కోరుకుంటున్నారు. గతేడాది మెగావేలం సందర్భంగా కొంతమంది కీలక ప్లేయర్లను వదిలేయక తప్పలేదు. డేవిడ్ మిల్లర్, మోహిత్ శర్మ, మహ్మద్ షమీ, నూర్ అహ్మద్ లాంటి వాళ్లను రిలీజ్ చేసి, వేలంలో జోస్ బట్లర్, కగిసో రబాడ, గ్లెన్ ఫిలిప్స్ లతో పాటు కొంతమందిని కొనుగోలు చేసింది. జట్టు బ్యాటింగ్ విషయానికొస్తే కెప్టెన్ గిల్, బట్లర్, సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, గ్లెన్ ఫిలిప్స్, షారూఖ్ ఖాన్ లతో పటిష్టంగానే ఉంది. ఆల్ రౌండర్ గా రషీద్,వాషింగ్టన్ సుందర్ అటు బ్యాట్ తోనూ, ఇటు బంతితోనూ సత్తా చాటగలరు. ఇక బౌలింగ్ విషయానికొస్తే భారత పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఇషాంత్ శర్మలతోపాటు విదేశీ ప్లేయర్లు రబాడ, గెరాల్డ్ కొయెట్జీలతో బలంగా కనిపిస్తోంది. సరైన కూర్పుతో ముందుకు వెళితే నాకౌట్ లోకి ఈజీగా వెళ్లగలుగుతుంది. వేలానిక ముందు మిల్లర్ ను రిలీజ్ చేసి టైటాన్స్ తప్పు చేసిందా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మిడిలార్డర్లో తను వేగంగా పరుగులు సాధించి, ఒంటిచేత్తో మ్యాచ్ ను మలుపు తిప్పగల సామర్థ్యం అతని సొంతం.

### గుజరాత్ టైటాన్స్ పూర్తి స్క్వాడ్:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, గ్లెన్ ఫిలిప్స్, షారుక్ ఖాన్, రాహుల్ తేవాటియా, నిషాంత్ సింధు, షెర్ఫేన్ రూథర్ ఫర్డ్, మహిపాల్ లోమ్రోర్, రషీద్ ఖాన్, సాయి కిషోర్, అర్షద్ ఖాన్, జయంత్ యాదవ్, కరీం జనత్, వాషింగ్టన్ సుందర్, కుమార్ కుషాగ్ర, అనుజ్ రావత్, జోస్ బట్లర్, గెరాల్డ్ కోయెట్జీ, మనవ్ సుథార్, గుర్నూర్ బ్రార్, ఇషాంత్ శర్మ, కగిసో రబాడ, కుల్వంత్ ఖేజ్రోలియా, ప్రసిద్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

## ఇంగ్లాండ్ సిరీస్‌లో రోహిత్ కెప్టెన్‌గా కొనసాగేనా?



**న్యూఢిల్లీ:** ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీం ఇండియా ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు భారత జట్టు జూన్‌లో మైదానంలోకి అడుగుపెడుతుంది. అది ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. కానీ ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే రోహిత్ శర్మ ఈ పర్యటనలో టీం ఇండియా తరఫున ఆడతాడా.. ఆ సమయంలో అతడు కెప్టెన్ గా వ్యవహరిస్తాడా లేదా ? అతని కెప్టెన్సీలో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది కాబట్టి ఈ ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయి. ఈ పర్యటన సందర్భంగా రోహిత్ టెస్ట్‌ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇటీల తన రిటైర్మెంట్ వార్తలను తిరస్కరించారు. ఇప్పుడు అతని కెప్టెన్సీ గురించి కూడా ఒక కీలక అప్ డేట్ వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ కెరీర్‌లో ఒక పెద్ద మలుపు తిరిగింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. రోహిత్ శర్మ మరో పెద్ద పర్యటనకు జట్టును కెప్టెన్‌గా నియమించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి, దాని సెలక్షన్ ప్యానెల్ సపోర్ట్ దక్కించుకున్నాడు. దీని అర్థం ఇంగ్లాండ్ పర్యటనలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం వల్ల రోహిత్ టెస్ట్ కెరీర్ కొనసాగుతుందని అర్థం అవుతుంది. 2024-25 ఆస్ట్రేలియా పర్యటనలో టీం ఇండియా 3-1 తేడాతో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ సమయంలో రోహిత్ ప్రదర్శన పై విమర్శలు వచ్చాయి. రోహిత్ సిరీస్ చివరి మ్యాచ్‌లో ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవడంతో ఈ సిరీస్ ముగిసిన వెంటనే అతను టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతాడని అభిమానుల్లో పుకార్లు వ్యాపించడం ప్రారంభించాయి. కొంతమంది సీనియర్లు కూడా రోహిత్ టెస్ట్ ఫార్మాట్‌ను విడిచిపెట్టాలని భావించారు. కానీ రోహిత్ తన విమర్శకులకు తగిన సమాధానం ఇస్తూ ఒక పెద్ద ప్రకటన ఇచ్చాడు. సిడ్నీ టెస్ట్ రెండో రోజు లంచ్ సమయంలో స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ రోహిత్ శర్మ మాట్లాడుతూ, 'ఇప్పుడు పరుగులు రావడం లేదు, కానీ 5 నెలల తర్వాత కూడా అవి రావని హామీ లేదు. నేను కష్టపడి పనిచేస్తాను. కానీ ఈ నిర్ణయం రిటైర్మెంట్ గురించి కాదు. బయట ల్యాప్‌టాప్, పెన్ను, కాగితం పట్టుకుని కూర్చున్న వ్యక్తులు రిటైర్మెంట్ ఎప్పుడు వస్తుందో, నేను ఏ నిర్ణయాలు తీసుకుంటారో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ సిరీస్‌లోని 3 మ్యాచ్‌లలో రోహిత్ 3, 6, 10, 2, 9 పరుగులు చేశాడు. అంటే భారత కెప్టెన్ 5 ఇన్నింగ్స్‌లలో 6.20 సగటుతో మొత్తం 31 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ సిరీస్‌లో బిసిసిఐ కొత్త కెప్టెన్‌తో వెళ్లవచ్చని ప్రచారం జరిగింది. కానీ ప్రస్తుతానికి అది జరిగేలా కనిపించడం లేదు.

# పవన్‌కళ్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన ప్రకాశ్‌రాజ్



టాకీస్: జనసేనాని పవన్ కళ్యాణ్ చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ క్రమం లోనే తమిళనాట హిందీని తమపై రుద్దుతున్నారని హడావిడి చేస్తున్న కొందరి గురించి కామెంట్స్ చేశారు. అంటే పరోక్షంగా తమిళనాడు అంశాన్ని ప్రస్తావించారు. అన్ని దేశ భాషలే కదా. తమిళనాడులో హిందీ వద్దని అనడం ఎంత వరకు కరెక్ట్. మరి తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి.. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? మనం భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి.. బహుభాషలే దేశానికి మంచిది అంటూ పవన్ కళ్యాణ్ కామెంట్ చేశారు. అంతేకాదు తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలో అయిన ముస్లింలు అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దని అనలేదు. హిందువులు మాత్రం దేవాలయాలలో సంస్కృత మంత్రాలు చదవొద్దిని చెబుతుంటారు. ముస్లింలని చూసి హిందువులు చాలా నేర్చుకోవాలి. రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా అన్నారు పవన్ కళ్యాణ్. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు. మేం దక్షిణాది వాళ్లం నల్లగా ఉంటామనే మాటలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి. దక్షిణాదికి చెందిన సెంగోల్.. ఉత్తరాదిన ఉన్న పార్లమెంట్‌లో ఉంది. దీని అర్థం వైరుధ్యమొస్తే విడిపోవాలని కాదు. కలిసి పరిష్కారం వెతుక్కోవాలని. విధ్వంసం చాలా తేలిక. నిర్మించటమే కష్టం అని పవన్ అన్నారు. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకి ప్రకాశ్ రాజ్ తనదైన శైలిలో స్పందించారు. మీ హిందీ భాషను మా మీద రుద్దకండి', అని చెప్పడం ఇంకో భాషను ద్వేషించడం కాదు, 'స్వాభిమానంతో మా మాతృభాషను, మా తల్లిని కాపాడుకోవడం', అని పవన్ కళ్యాణ్ గారికి 'ఎవరైనా చెప్పండి ప్లీజ్' అంటూ ప్రకాష్ రాజ్ ట్వీట్ చేశారు.




'రాబిన్‌హుడ్' నుంచి డేవిడ్ వార్నర్

# ఫస్ట్ లుక్ విడుదల




టాకీస్: టాలీవుడ్ యువ నటుడు నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. 'భీష్మ' సినిమా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ మూవీ వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా మార్చి 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. అయితే, ఈ మూవీలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేసింది. "బౌండరీ నుంచి బాక్సాఫీస్‌కు వస్తున్న వార్నర్‌కు భారత సినిమాకు స్వాగతం" అంటూ వార్నర్ ప్రత్యేక పోస్టర్‌ను పంచుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# నటి హనీ రోజ్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన నటి ఫరా శిబిలా



టాకీస్: నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకుంది హాట్ బ్యూటీ హనీరోజ్. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ గతంలో తెలుగులో సినిమాలు చేసింది. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేదు. ఆతర్వాత మలయాళం పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ వరుసగా సినిమాలు చేసి క్రేజ్ తెచ్చుకుంది. మలయాళంలో హనీ రోజ్ చాలా పాపులర్ నటి. వీరసింహారెడ్డి సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ మరో సినిమా అనౌన్స్ చేయలేదు. చాలా రోజుల తర్వాత హనీ రాచెల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మలయాళంతో పాటు పలు భాషల్లోనూ విడుదల కానుంది. సినిమాలే కాకుండా సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది ఈ బ్యూటీ. హనీ రోజ్ చేసిన అన్ని ఫోటోషూట్‌లు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అంతే కాదు ఈ అమ్మడు సినిమాలతో కంటే షాపింగ్ మాల్స్ ఓపినింగ్స్ తోనే కాలం గడిపేస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా హనీ రోజ్ పై ఓ నటి తీవ్ర ఆరోపణలు చేసింది. హనీరోజ్ తప్పుడు దారిలో డబ్బులు సంపాదిస్తుందని ఆమె ఆరోపించింది. ఇంతకూ ఆమె ఎవరంటే ఫరా శిబిలా. నటి ఫరా శిబిలా హనీరోజ్ గురించి మాట్లాడుతూ.. మనపై మనకు నమ్మకం ఉండాలి. అప్పుడే ముందడుగు వేయాలి. ఎవరైనా సరే ప్రతిభను నమ్ముకోవాలి కానీ శరీరాన్ని కాదు. ఇక హనీ రోజ్ ఇప్పుడు శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదిస్తోంది అంటూ చెప్పుకొచ్చింది. హనీరోజ్ డ్రస్సింగ్ గురించి నేను మాట్లాడటం లేదు. కానీ ఆమె ఫోటో షూట్స్ లో రకరకాల ఫోజులు ఇస్తూ ఫోటోలు దిగుతుంది. రకరకాల యాంగిల్స్ లో తీసిన ఫోటోలను, వీడియోలను ఆమె స్వయంగా షేర్ చేస్తోంది. ఇంస్టాగ్రామ్ లో అందరూ కూడా తమ శరీరాలను చూపిస్తూ ఎగ్జిబిషన్ పెట్టేస్తున్నారు. హనీరోజ్ కూడా అదే చేస్తుంది అని ఆమె ఆరోపించింది. హనీరోజ్ అమాయకురాలు కాదు. ఆమెకు అన్ని తెలుసు. శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదించడం అనేది తప్పు అని నా అభిప్రాయం అని తెలిపింది. మరి దీని పై హని రోజ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.




# నితిన్ కోసమే చేశా..: గుత్తా జ్వాల

## 'గుండెజారి గల్లంతయ్యిందే' సినిమా సాంగ్‌పై వివరణ

హైదరాబాద్: బ్యాడ్మింటన్ లో స్టార్ క్రీడాకారిణిగా రాణించిన గుత్తా జ్వాలా హీరో నితిన్ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించిన విషయం తెలిసిందే. గుండెజారి గల్లంతయ్యిందే సినిమాలోని ఈ స్పెషల్ సాంగ్ తాను చేయడానికి కారణం హీరో నితన్ అని గుత్తా జ్వాలా చెప్పుకొచ్చారు. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుత్తా జ్వాలా ఈ విషయాన్ని వెల్లడించారు. నితిన్ కోసం, ఆయన పట్టుబట్టడం వల్లే ఆ సాంగ్ చేశానని తెలిపారు. బ్యాడ్మింటన్ లో రాణిస్తుండగా, ఆ తర్వాత కూడా తనకు సినిమా అవకాశాలు వచ్చాయని చెప్పారు. అయితే, తనకు సినిమాలపై ఆసక్తిలేదని సున్నితంగా తిరస్కరించానని వివరించారు. సినిమా ఇండస్ట్రీలో తనకు చాలామంది స్నేహితులు ఉన్నారని, వారిని చూస్తే సినిమా రంగంలో ఎలా ఉండాలో తెలుస్తుందని గుత్తా జ్వాలా వివరించారు. సినిమాల్లో రాణించాలంటే సిగ్గు పడకూడదని, అది తనవల్ల కాదని చెప్పారు. ఎప్పుడో చేసిన సాంగ్ షూటింగ్ గురించి ఇప్పుడు మాట్లాడినా ఏదోలా అనిపిస్తుందని అన్నారు. చాలా విషయాల్లో సర్దుకుపోవాల్సి వస్తుందని వివరించారు. తన మనస్తత్వానికి అది సరిపడదని తెలిపారు. బ్యాడ్మింట న్ లో పది గంటలు ప్రాక్టీస్ చేస్తే తర్వాత విశ్రాంతి తీసుకునే వీలుంటుందని, సినిమాల్లో అయితే 24 గంటలూ ఏదో ఒక పని ఉంటుందని గుత్తా జ్వాలా చెప్పుకొచ్చారు. సాంగ్ లో చేయడానికి కారణం ఇదే.. హీరో నితిన్ తనకు మంచి స్నేహి తుడని గుత్తా జ్వాలా చెప్పారు. ఓసారి పార్టీ జరుగుతుండగా తన సినిమాలో సాంగ్ చేయాలని కోరాడన్నారు. అప్పుడు తప్పించు కోవడానికి సరే అన్నానని, పార్టీ ముగిశాక ఆ విషయమే మర్చిపోయానని తెలిపారు. అయితే, మూడు నెలల తర్వాత నితిన్ తన దగ్గర మళ్లీ ఆ సాంగ్ ప్రస్తావన తీసుకొచ్చాడని, సాంగ్ ఫైనల్ అయిందని, చిత్రీకరణ త్వరలో ప్రారంభిస్తాం రెడీగా ఉండాలని చెప్పాడన్నారు. అప్పుడు నేను చేయ లేనని చెబితే నితిన్ ఒప్పుకోలేదని, సాంగ్ లో తాను ఉండాల్సిందేనని పట్టుబట్టాడని తెలిపారు. తాను ఆ సాంగ్ లో కనిపించడం వల్ల నేషనల్ మీడియాలో ఆ సినిమా గురించి ఆర్టికల్స్ వచ్చాయని, సినిమాకు మంచి ప్రచారం జరిగిందని గుత్తా జ్వాలా చెప్పారు.

## కార్ రేసింగ్ ట్రాక్ వద్ద శోభిత, నాగచైతన్య క్యూట్ ఫొటోలు

టాకీస్: ప్రస్తుతం టాలీవుడ్ క్యూట్ కపుల్స్‌లో నాగ చైతన్య, శోభిత జంట ఒకటి. సమంత నుండి విడిపోయాక నాగ చైతన్య కొన్ని నెలల పాటు శోభితతో ప్రేమాయణం నడిపి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. ఇక పెళ్ళైనప్పటి నుండి వీరిద్దరు చాలా సరదాగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ రోల్ పోషించే శోభిత ఎప్పటికప్పుడు వాటికి సంబంధిచిన ఫోటోస్ షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్ , మెక్సికోలలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేశారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు ఎలా గడిపారో ఫోటోల ద్వారా తన అభిమానులకు తెలియజేసింది. అయితే తాజాగా ఈ జంట రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసింది. తండేల్ సక్సెస్ తర్వాత నాగచైతన్య, శోభిత దంపతులు హాలిడే ట్రిప్ ఎంజాయ్ చేస్తుండగా, ఈ క్రమంలోనే కార్ రేసింగ్ ట్రాక్ వద్ద తమ దేను



సరదాగా గడిపారు. చై, శోభిత కలిసి రేసింగ్ ట్రాక్‌లో గడిపిన క్షణాలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కాగా, చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం . అందుకే శోభితను సైతం అక్కడకు తీసుకెళ్లారు. ఆమెతో సరాదాగా రేసింగ్ కారు నడిపారు. అంతే కాదండోయ్.. నాగ చైతన్య తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగగా, ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇటీవలే ఈ కపుల్ యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేశారు. గతేడాది డిసెంబర్ 4న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శోభిత మెడలో మూడు ముళ్లు వేశాడు నాగ చైతన్య. ఓ ఇంటర్వ్యూలో ఆమెతో జీవితాన్ని పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని.. తనతో అన్ని విషయాలు పంచుకుంటానని, ఎప్పుడైనా కన్‌ఫ్యూజ్ అయితే వెంటనే ఆమె సలహా తీసుకుంటానని నాగ చైతన్య స్పష్టం చేశారు. తండేల్ సక్సెస్ జోష్ లో ఉన్న నాగ చైతన్య ఇప్పుడు చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. భార్య శోభితని తీసుకొని పలు ప్రాంతాలకి తిరుగుతు న్నాడు. ఈ కొత్త జంటను ఇలా చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతు న్నారు. క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## ఆ ఇద్దరు నిర్మాతలకు హ్యాండిచ్చిన సన్నిడియోల్

టాకీస్: బాలీవుడ్‌లో ఏ హీరో కు ఎప్పుడు టైమ్ వస్తుందో చెప్పడం కష్టం. అగ్ర కథానాయకులుగా రాణించిన వారు... ఒక్కసారిగా తెర మాటుకు వెళ్ళిపోతుంటారు. 'ఇక ఈ హీరో పని అయిపోయింది' అనుకున్న సమయంలో సీనియర్ హీరోలు ఊహించని విజయంతో తెర మీదకు వస్తున్నారు. ప్రస్తుతం సన్నీ డియోల్ పరిస్థితి ఇదే. సన్నీ డియోల్ కు ఇక విజయం దక్కడం కష్టమని అంతా అనుకుంటున్న టైమ్ లో 'గదర్ -2' సినిమాతో అమాంతంగా రూ. 500 కోట్ల క్లబ్



లో చేరి 'సన్నీ ఈజ్ బ్యాక్' అనిపించుకున్నాడు. అయితే 'గదర్ -2' సక్సెస్ తర్వాత సన్నీ డియోల్ ప్రాధాన్యతలు మారిపోయాంటూ కొందరు వాపోతున్నారు. 'గదర్ -2' చిత్రానికి ముందు సన్నీ కొన్ని సినిమాలు అంగీకరించాడు. అందులో ఒకటి 'సూర్య'. ఇది మలయాళ చిత్రం 'జోసఫ్'కు రీమేక్. కమల్ ముకుత్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు ఎనభై శాతం షూటింగ్ అయిపోయింది. కానీ నిర్మాణపరంగా జరిగిన జాప్యంతో ఈ మూవీ వెనక్కి వెళ్ళిపోయి 'గదర్ -2' ముందు కొచ్చింది. 'గదర్ -2' తర్వాత 'సూర్య' ను పూర్తి చేస్తానని సన్నీ చాలా సార్లు చెప్పారు. కారణాలు ఏవైనా... అది మాత్రం జరగలేదు. విశేషం ఏమంటే మలయాళ చిత్రం 'జోసఫ్' ను తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ రీమేక్ చేశారు. తెలుగులో దీనిని 'శేఖర్' పేరుతో రాజశేఖర్ రీమేక్ చేయగా, జీవిత డైరెక్ట్ చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.